PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 20 | విజయవాడ, మంగళవారం 20 ఆగస్టు 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 20 August 2024 | Rs



అమన్‌కు 2వ ర్యాంక్

యుడబ్ల్యుడబ్ల్యు ర్యాంకింగ్స్ విడుదల

6

వైద్య సిబ్బంది రక్షణకు తక్షణమే సమగ్ర చట్టం

- సిపిఎం డిమాండ్

న్యూఢిల్లీ : వైద్య సిబ్బంది రక్షణకు తక్షణమే ఒక సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని సిపిఎం డిమాండ్ చేసింది. పార్టీ పొలిట్‌బ్యూరో సోమవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదలజేసింది. కొల్‌కతాలోని ఆర్‌జి కార్ ఆస్పత్రిలో యువ వైద్యురాలిపై అత్యంత దుర్మార్గంగా అత్యాచారం , అనంతరం హత్య చేయడంపై దేశవ్యాప్తంగా డాక్టర్లు ముఖ్యంగా జూనియర్ డాక్టర్ల నిరసనలు, ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఆందోళనలు, నిరసనలు చూస్తుంటే యువ మహిళా బాధితురాలికి సంఘీభావం తెలియచేయడమే కాకుండా డాక్టర్లు ఎంత అభద్రతా వాతావరణంలో, ఏ మాత్రం సురక్షితంగా లేని పరిస్థితుల్లో పనిచేస్తున్నారో వెల్లడవుతోందని పొలిట్‌బ్యూరో పేర్కొంది. వైద్య సిబ్బంది నిరసనలు, ఆందోళనలకు ప్రజా మద్దతు పెద్దయెత్తున లభిస్తోంది. వైద్య సిబ్బంది రక్షణకు సమగ్ర చట్టాన్ని తీసుకురావాలన్న డిమాండ్‌పై అత్యవసరంగా స్పందించడానికి బదులు మోడీ ప్రభుత్వం ఈ విషయంపై విచారణకు కమిటీని ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం దురదృష్టకరమని పొలిట్‌బ్యూరో వ్యాఖ్యానించింది. వైద్య వర్గాలతో చర్చలు, సంప్రదింపులు జరిపి ఇంకెంతమాత్రం జాప్యం చేయకుండా చట్టాన్ని వెంటనే తీసుకురావాలని కోరింది.

ఈ కేసును సుప్రీం కోర్టు సుమోటోగా తీసుకున్నా, తగు చట్టం తీసుకురావడమనేది కేంద్ర ప్రభుత్వ పరిధిలో అంశమని పొలిట్‌బ్యూరో పేర్కొంది.

బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించినంతవరకు, న్యాయ ప్రక్రియను ధ్వంసం చేసేందుకు యత్నిస్తున్నట్లు ప్రతి రోజూ తాజా రుజువులు బయటకొస్తున్నాయని, దీనిపై ధైర్యం చేసి ప్రశ్నించినవారిని బెదిరిస్తున్నారని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ముఖ్యమంత్రి పట్ల, ప్రభుత్వం పట్ల తమకు ఎలాంటి నమ్మకం లేదని బాధితురాలి తండ్రి ప్రకటించారని, ప్రజలు కూడా అదే అభిప్రాయం వ్యక్తం చేయడం చూస్తుంటే ప్రతి దశలోనూ నిజాలను బయటకు రాకుండా తొక్కిపట్టేందుకు ఎలా ప్రయత్నిస్తున్నదీ తేటతెల్లమవుతోందని పొలిట్‌బ్యూరో వ్యాఖ్యానించింది.

ఈ రీత్యా కేంద్ర ప్రభుత్వం ఈ విషయమై తక్షణమే స్పందించి తగు చట్టాన్ని తీసుకురావాలని పొలిట్ పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. వాస్తవాలను మరుగుపరచి, ఇంతటి నీచమైన నేరానికి పాల్పడినవారిని కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెరచాటునుంచి చేస్తున్న యత్నాలను పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. బాధితురాలికి, ఆమె కుటుంబానికి న్యాయం జరిగేలా చేడాలని డిమాండ్ చేసింది.

అనాథాశ్రమంలో ఘోరం

ఫుడ్ పాయిజన్‌తో ముగ్గురు చిన్నారులు మృతి

- 95 మందికి అస్వస్థత
- మృతులు, అస్వస్థతకు గురైన వారంతా గిరిజన విద్యార్థులే
- ఉన్నత స్థాయి విచారణకు ముఖ్యమంత్రి ఆదేశం
- ఘటనపై సిపిఎం దిగ్భ్రాంతి



విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న బాలికను పరామర్శిస్తున్న హోం మంత్రి అనిత



పాంగి శ్రద్ధ



జాషువా



నిత్య

ప్రజాశక్తి- యంత్రాంగం

వాళ్లు అమాయక గిరిజనులు ... అందులోనూ అమ్మా, నాన్న లేని చిన్నారులు! అందరూ ఉన్నా పూట గడవడం కష్టమైన మరికొందరు పిల్లలు.... దినదిన గండంగా మారిన బతుకులకు తిండి పెట్టి, చదువు చెప్పిస్తామంటే ఎంతటి భరోసా...! కానీ, ఎవరి పొరపాటో ... ఆ అనాథాశ్రమంలో కలుషితాహారం విషం చిమ్మింది. కేరింతలు కొడుతూ విందుభోజనం చేసిన కాసేపటికే అభం, శుభం తెలియని ఆ పసిపిల్లలు కడుపు పట్టుకుని తల్లడిల్లిపోయారు. ఒకరి.... తరువాత ఒకరిగా 95 మంది విద్యార్థులు కుప్పకూలిపోయారు. వీరిలో ఎనిమిది సంవత్సరాల లోపు చిన్నారులు ముగ్గురు మృతి చెందారు. మిగిలిన వారు వివిధ ఆస్పత్రుల్లో చికిత్సపొందుతున్నారు. తీవ్ర అస్వస్థతకు గురైన 14మందిని మెరుగైన వైద్యం కోసం కెజిహెచ్‌కు తరలించారు. అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని పరిశుద్ధాత్మ అగ్ని స్తుతి ఆరాధన ట్రస్ట్ అనాథాశ్రమంలో జరిగిన ఈ ఘోరం సోమవారం వెలుగులోకి రాగానే రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించడంతో అధికార యంత్రాంగం ఉరుకులు, పరుగులు పెట్టింది. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నత స్థాయి విచారణకు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఘటనపై సిపిఎం తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది.

ఏం జరిగింది?

శనివారం మధ్యాహ్నం నక్కపల్లి మండలానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ వారు అనాథాశ్రమంలోని విద్యార్థులకు సమోసా, చాక్లెట్లు అందించారు. కోటవురట్ల మండలం పొందూరు గ్రామంలో ఒకరి పెదకర్మ సందర్భంగా వండిన పలావు, వైట్‌రైస్, సాంబారు, పన్నీర్ కర్రీ, పునుకుల కర్రీని రాత్రికి విద్యార్థులకు పెట్టారు. మధ్యాహ్న భోజనం తరువాత మిగిలిన పదార్థాలను అనాథాశ్రమానికి పంపినట్లుగా చెబుతున్నారు. అవి తిన్న తరువాత విద్యార్థులు అస్వస్థతకు గురవడం మొదలైంది. అయితే, జిల్లా కలెక్టర్ విడుదల చేసిన ప్రకటనలో చర్చి ఫాదర్ ఏర్పాటు చేసిన పేరెంట్స్‌మీట్‌లో ఏర్పాటు చేసిన విందుభోజనం తిని విద్యార్థులు అస్వస్థతకు గురయినట్లు తెలిపారు. ఈ సంఘటనలో చింతపల్లి మండలం బలబద్రం గ్రామానికి చెందిన కొర్ర శ్రద్ధ (7), నిమ్మలపాలెం గ్రామానికి చెందిన తంబెల్లి ఝాషువా(7), రెల్లెల పాలెంకు చెందిన గెమ్మెలి నిత్య (భవాని-8) మృతి చెందారు. వీరు ఆస్పత్రికి వెళ్లకుండా తమ ఇళ్లకు వెళ్లారని కలెక్టర్ పేర్కొన్నారు. వీరిలో ఝాషువా శనివారం సాయంత్రం మృతి చెందారు. ఆదివారం కూడా మరణాలు కొనసాగడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో అనకాపల్లి జాయింట్ కలెక్టర్ జాహ్నవి అనాథాశ్రమాన్ని సందర్శించారు. అక్కడి వసతి సౌకర్యాలపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ట్రస్టుకు చెందిన అనాథాశ్రమాన్ని ఆర్‌డిఒ జైరావు సీజ్ చేశారు. ఫాదర్ మిగతా 5లో



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న కలకత్తా హైకోర్టు న్యాయవాదులు

నిందితుడికి నేడు లై డిటెక్టర్ పరీక్ష?

- డాక్టర్ డైరీలో చిరిగిన పేజీ?
- కోల్‌కతా డాక్టర్ కేసు విచారణ 29కి వాయిదా వేసిన హైకోర్టు
- కొనసాగుతున్న సిబిఐ ఇంటరాగేషన్
- కలకత్తా హైకోర్టు లాయర్ల నిరసన
- మమత విశ్వసనీయత జీరో : బృందాకరత్

కోల్‌కతా/ న్యూఢిల్లీ : కోల్‌కతా జూనియర్ డాక్టర్ అత్యాచారం, హత్య కేసులో నిందితుడికి దర్యాప్తు అధికారులు లై డిటెక్టర్ పరీక్ష నిర్వహించేందుకు కలకత్తా హైకోర్టు అనుమతించింది. దీంతో ఈ కేసులో కీలక నిందితుడు, సివిక్ వలంటీర్ అయిన సంజయ్ రాయ్‌కు సిబిఐ అధికారులు మంగళ వారం పాలిగ్రాఫ్ పరీక్ష నిర్వహించే అవకాశం వుంది. లై డిటెక్టర్ పరీక్షకు అనుమతించిన తర్వాత హైకోర్టు ఈ కేసును 29కి వాయిదా వేసింది.

డైరీలో చిరిగిన పేజీ?

తన కుమార్తె వ్యక్తిగత విషయాలను ప్రతి రోజూ తన డైరీలో రాసుకునేదని, ఆ పుస్తకం ఎప్పుడూ తన బ్యాగ్‌లోనే వుండేదని కానీ అందులో ఒక పేజీ కొంతమేర చిరిగి వుందని బాధితురాలి తండ్రి మీడియాకు తెలిపారు. తన కుమార్తె ఇంటికి వచ్చిన తర్వాత ప్రతి విషయమూ తమతో పంచుకునేదని చెప్పారు. డైరీలో చిరిగిన పేజీకి సంబంధించి తాను ఫోటో కూడా తీసినట్లు తెలిపారు. అంతకుమించి ఆ పేజీలో గల వివరాలను వెల్లడించడానికి ఆయన నిరాకరించారు. అందులోని విషయాలు బహిరంగపరచవద్దని సిబిఐ కోరినట్లు తెలిపారు.

నాల్గో రోజూ సిబిఐ ఇంటరాగేషన్

వరుసగా నాల్గవ రోజైన సోమవారం కూడా సిబిఐ అధికారులు ఆర్‌జికార్ మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ సందీప్ ఘోష్‌ను మిగతా 5లో

గోదావరిలో నీళ్లు మాయం

- గతంలోనే నిపుణుల నివేదిక
- ముఖ్యమంత్రికి రాఘవులు లేఖ
- డయాఫ్రం వాల్ నిర్మాణంపై ఉన్నతస్థాయి కమిటీ
- నిర్వాసితులకు ఉదారంగా పరిహారం, పునరావాసం కల్పించాలి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గోదావరిలో ప్రవహించే నీరు పెద్ద మొత్తంలో మాయమవుతోందంటూ నిపుణులు గతంలోనే ఇచ్చిన నివేదికపై ప్రభుత్వ వైఖరేమిటో తెలియజేయాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు కోరారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఆయన సోమవారం ఒక లేఖ రాశారు. ముఖ్యమైన ఈ సాంకేతిక విషయాన్ని ప్రభుత్వం విస్మరిస్తుండటంతో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. గోదావరిలో ప్రవహించే నీటిలో భారీ మొత్తంలో కోయిదా-పోలవరం మధ్య మాయవుతున్నట్లు, దీనిని నిరోధించకపోతే ప్రాజెక్టు పూర్తిచేసినా రిజర్వాయర్ నీరు కొన్ని రోజుల్లోనే ఇంకిపోతాయని నీటిపారుదలరంగ నిపుణులు గతంలోనే హెచ్చరించిన విషయాన్ని రాఘవులు ప్రస్తావించారు. ఈ సమస్యపై ప్రభుత్వ ఆదేశాల మేరకు పరిశోధన చేసిన భౌగోళిక నిపుణులు ఉపరితలంలో ఎక్కడా లీకు కావడం లేదని, నదీగర్భంలో లీకు జరుగుతుందేమోనని పరిశీలించాలని నివేదించారని తెలిపారు. ఈ అంశంపై ప్రభుత్వాలు ఇప్పటివరకూ అవసరమైన చర్యలు తీసుకోలేదని తెలిపారు. తీసుకునిఉంటే నిర్ధారణలేమిటో బయటపెట్టాలని కోరారు. లీకేజీ నిజమయితే కొత్త డయాఫ్రం వాల్ వల్ల ప్రయోజనం ఏమీ ఉండదని పేర్కొన్నారు. ఈ విషయాలను కీర్తిశేషులు ప్రొఫెసర్ శివాజీరావు, విశ్రాంత నీటిపారుదల ఇంజనీరు సుబ్బారాయుడు ప్రభుత్వం దృష్టికి గతంలోనే తెచ్చారని, ఈ విషయంపై ప్రభుత్వ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని ఆయన కోరారు.

పోలవరం ప్రాజెక్టు కార్యాలయంలో ఫైళ్లు దహనం అయ్యాయన్న వార్త దిగ్భ్రాంతిని కలిగించిందని పేర్కొన్నారు. దగ్ధమైన ఫైళ్లు భూనిర్వాసితుల పరిహారం చెల్లింపులకు సంబంధించినవని, చెల్లింపుల్లో జరిగిన అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు ఫైళ్లను కాల్చివేశారని మీడియాలో కథనాలు వచ్చాయని, ఇది మరింత ఆందోళన కలిగించే అంశమని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు వల్ల ప్రత్యక్షంగా గిరిజనులకు ఏమాత్రమూ ప్రయోజనం లేకపోయినా కొంప, గోడు, భూములు సర్వస్వాన్ని త్యాగం చేశారని గుర్తుచేశారు. దీనిని దృష్టిలో ఉంచుకుని గిరిజన నిర్వాసితులకు ఎవరికన్నా ఎక్కువగా పరిహారం ఇచ్చి, పునరావాసం కల్పించడం ప్రభుత్వ ధర్మమని తెలిపారు. ఇప్పటి వరకూ నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వాలు నిర్లక్ష్యంచేస్తూ వచ్చాయని పేర్కొన్నారు. వారి సమస్యలు పరిష్కరించకుండానే 2026 నాటికి ప్రాజెక్టును పూర్తి చేస్తామని ప్రకటించిన విషయాన్ని గుర్తిచేసిన రాఘవులు దీనర్థం వారిని నీట ముంచైనా ముందుకు పోతామని చెప్పడమేనన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇప్పటి వరకూ జరిగిన అత్తెసరు నష్టపరిహారం చెల్లింపుల్లో కూడా భారీగా అక్రమాలు జరిగిన నేపథ్యంలో ప్రభుత్వ నిర్వాసితులకు సంబంధించిన అన్ని వివరాలతో ఒక వివరణ పత్రాన్ని విడుదల చేయాలని కోరారు. దానిపై శాసనసభలో ప్రత్యేకంగా చర్చించాలని సూచించారు. ప్రతి సోమవారం పోలవరం అన్న నినాదంతో ఈప్రాజెక్టుకు ప్రాధాన్యత ఇచ్చినట్లు, 30 సార్లకు పైగా ప్రాజెక్టును సందర్శించినట్లు ఫ్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రంలో మిగతా 2లో

అత్యుత్తమ ఎకనామిక్ జోన్‌గా 'శ్రీసిటీ'

- 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' వైపు పయనం
- ఏడు పరిశ్రమలకు శంకుస్థాపన
- బిజీబిజీగా ముఖ్యమంత్రి చంద్రబాబు



శ్రీసిటీలో పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల్లో సిఎం చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్, సత్యవేడు

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వైపుగా పారిశ్రామిక రంగం వెళ్లాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. శ్రీసిటీని అత్యుత్తమ ఎకనమిక్ జోన్‌గా తయారు చేయాలనేది తన ఆలోచనని, ఐజిబిసి గోల్డెన్ రేటింగ్ గుర్తింపు వచ్చేలా కృషి చేస్తున్నామని తెలిపారు. పరిశ్రమాధిపతులకు ఇబ్బంది లేకుండా లా అండ్ ఆర్డర్ అమలు చేస్తామన్నారు. తిరుపతి జిల్లా శ్రీసిటీలో 15 సంస్థల కార్యకలాపాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఏడు పరిశ్రమలకు శంకుస్థాపన చేశారు. ఐదు కంపెనీలతో రూ.1,213 కోట్ల పెట్టుబడికి కొత్తగా ఒప్పందాలు చేసుకున్నారు. వీటి ద్వారా 15,280 మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నాయని తెలిపారు. శ్రీసిటీలో ఫైర్ స్టేషన్‌ను ప్రారంభించారు. పోలీస్ స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో పలు కంపెనీల సిఇఒలతో చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకేచోట 30 కంపెనీల ప్రతినిధులతో భేటీ కావడం గొప్ప విషయమన్నారు. శ్రీసిటీలో ఎనిమిది వేల ఎకరాల్లో పారిశ్రామిక జోన్లు ఏర్పాటయ్యాయని, ఇక్కడ 220 కంపెనీల ఏర్పాటుకు అవకాశం ఉందని తెలిపారు. సెజ్, డొమెస్టిక్ జోన్, ఫ్రీ ట్రేడ్ జోన్ ఇక్కడ ఏర్పాటయ్యాయన్నారు. ఆటోమేటివ్, ఎలక్ట్రానిక్స్, ఎఫ్‌ఎంసిజి, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు వచ్చాయని తెలిపారు. శ్రీసిటీలో 4.5 బిలియన్ డాలర్ల పెట్టుబడులు, నాలుగు బిలియన్ డాలర్ల ఎగుమతులు సాధించడం గొప్ప విషయమన్నారు. తక్కువ ఖర్చుతో ఉత్పత్తి చేసేందుకు శ్రీ సిటీ వేదిక కావాలని పేర్కొన్నారు. ఇప్పటికే తాము విజన్ 2047 లక్ష్యంతో ముందుకెళ్తున్నామని, రానున్న 25 సంవత్సరాల్లో 15 శాతం వృద్ధి రేటు తమ లక్ష్యమని తెలిపారు. రాష్ట్ర మిగతా 2లో

చికాగోలో పాలస్తీనాకు సంఘీభావంగా భారీ ర్యాలీ



చికాగోలో సోమవారం డెమొక్రాటిక్ నేషనల్ కన్వెన్షన్ హాలుకి వెలుపల పాలస్తీనాకు సంఘీభావంగా నిర్వహించిన భారీ ప్రదర్శన. గాజాలో తక్షణమే కాల్పుల విరమణకు డిమాండ్ చేస్తూ సాగిన ఈ ప్రదరన్మలో 40 వేల మంది వరకూ పాల్గొన్నారు. (వార్త 5లో)

సిద్ధరామయ్యకు ఊరట

- ముడా స్కాంలో 29 వరకు చర్యలొద్దు : హైకోర్టు

బెంగళూరు : ముడా స్కాంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు ఊరట లభించింది. సిద్ధరామయ్యపై ఈ నెల 29 వరకు ఎలాంటి చర్యలు చేపట్టరాదని కర్ణాటక హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. గవర్నర్ ఇచ్చిన అనుమతుల విషయంలోనూ ప్రత్యేక కోర్టు ముందుకు వెళ్లవద్దని న్యాయమూర్తి ఎం.నాగ ప్రసన్న సోమవారం ఈ ఆదేశాలు జారీచేశారు. మైసూర్ నగర అభివృద్ధి సంస్థ (ముడా) కేటాయించిన ప్లాట్లలో సిద్ధరామయ్య కుటుంబానికి అక్రమంగా లబ్ధి చేరిందని, వాటిపై విచారణ జరపాలని ప్రత్యేక కోర్టులో ఫిర్యాదు దాఖలయింది. సిద్ధరామయ్యపై విచారణకు గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ ఏకపక్షంగా అనుమతి ఇచ్చారు. సిద్ధరామయ్యపై పిటీషన్లను విచారించాలా? వద్దా? అనే విషయమై ప్రత్యేక కోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉన్న నేపథ్యంలో హైకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది.

'ఉపాధి హామీ'లో అగ్రగామిగా రాష్ట్రం

- గ్రామసభ ఆమోదం తప్పనిసరి : డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే ఉపాధి హామీ పనులకు సంబంధించి గ్రామ సభ ఆమోదం తప్పనిసరిగా తీసుకోవాలని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. గ్రామ సభలు అర్థవంతంగా జరగాలంటే ప్రజలు, అధికారులు మనస్ఫూర్తిగా పాల్గొనాలన్నారు. సచివాలయం నుంచి సోమవారం గ్రామ సభలపై జిల్లా పరిషత్ సిఇఒ, డిపిఒ, డ్వామా పిడిలు, ఎంపిడిఒలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 23న రాష్ట్రవ్యాప్తంగా 13,326 గ్రామ పంచాయతీల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకేరోజు గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు భాగస్వాములు కావాలన్నారు. సమిష్టిగా పనిచేసి ఉపాధి హామీ పనుల అమల్లో దేశంలో అగ్రగామిగా నిలవాలని, ఉపాధి పనుల నాణ్యత విషయంలో రాజీ పడొద్దని అధికారులకు సూచించారు. గ్రామసభల గురించి గ్రామాల్లో రెండు రోజుల ముందుగానే దండోరా వేసి ప్రజలకు తెలపాలన్నారు. ఉపాధి హామీ పథకంలో ప్రతి కుటుంబానికీ 100 రోజుల పనిదినాలను కల్పిస్తున్నారనే అంశంపై అవగాహన కల్పించడంతో పాటు కూలీలకు వారి హక్కుల గురించి తెలపాలని అధికారులకు సూచించారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవడానికి సంబంధించిన పనుల వివరాలను గ్రామ సభలో ప్రతి ఒక్కరికీ అర్థమయ్యే రీతిలో వివరించాలన్నారు.

బాధ్యతలను విస్మరిస్తే ఉపేక్షించేది లేదు

జిల్లాస్థాయి అధికారులు ముఖ్యంగా పీడీలు గ్రామాలను సందర్శించడం లేదని, పని ప్రదేశాలను తనిఖీ చేయడం లేదని, సోషల్ ఆడిట్ సభలకు హాజరు కావడం లేదని తన దృష్టికి వచ్చిందని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు బాధ్యతలను విస్మరిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఇకపై అలాంటి విధానాలను మార్చుకోవాలని, మండల స్థాయిలో పథకం అమలులో పూర్తి బాధ్యత వహించాల్సిన ఎంపిడిఒలు ఇది మన పనికాదన్నట్లు వ్యవహరించడం తగదని అన్నారు. మండల స్థాయిలో అవకతవకలకు వారే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, సంచాలకులు కృష్ణతేజ, ఇఎన్‌సిలు బాలూ నాయక్, సంజీవరెడ్డి, వాటర్‌షెడ్ డైరెక్టరు పివిఆర్‌ఎం రెడ్డి, అదనపు కమిషనరు సుధాకరరావు, జాయింట్ కమిషనరు శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పని సర్దుబాబు

- ఉత్తర్వులు విడుదల చేసిన పాఠశాల విద్య

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్, మున్సిపల్ పాఠశాలల ఉపాధ్యాయుల పని సర్దుబాటుకు పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ మేరకు ఆ శాఖ డైరెక్టరు వి విజయరామరాజు సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. మిగులుగా ఉన్న ఉపాధ్యాయులను పాఠశాలల అవసరాన్ని బట్టి సర్దుబాటు ఉంటుందని తెలిపారు. ఆగస్టు 9వ తేదీ నాటికి పాఠశాలల్లోని ఎన్‌రోల్‌మెంట్ ఆధారంగా జరుగుతుందని వెల్లడించారు. జిల్లా స్థాయిలో డిఇఒ, డివిజన్ స్థాయిలో డిప్యూటీ డిఇఒ, మండల స్థాయిలో ఎంఇఒ నోడల్ అధికారులుగా ఉంటారు. 1 నుంచి 8వ తరగతి ప్రాథమికోన్నత పాఠశాలలకు విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ 98లోపు ఉంటే ఐదుగురు ఉపాధ్యాయులను కేటాయిస్తారు. 2025 మే లోపు ఉద్యోగ విరమణ పొందే ఉపాధ్యాయులు, 70 శాతానికి పైగా అంగవైకల్యం ఉన్న వికలాంగులకు పని సర్దుబాటు నుంచి మినహాయింపు ఉంది.

బిజెపి కార్యకర్త హత్య

ప్రజాశక్తి-ఆదోని రూరల్

కర్నూలు జిల్లా ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామంలో బిజెపి కార్యకర్త శేఖన్న (50)ను కొందరు దుండగులు సోమవారం హత్యచేశారు. ఇంటి ముందు నిద్రిస్తున్న ఆయనను దుండగులు గొంతు కోసి చంపారు. శేఖన్న గత కొన్ని రోజుల క్రితం ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి ఆధ్వర్యంలో వైసిపి నుంచి బిజెపిలో చేరారు. ఇంటి ముందు నిద్రిస్తున్న వ్యక్తి శవమై పడి ఉండడంతో కుటుంబసభ్యులు గమనించి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. హత్య కారణాలపై పోలీసులు ఆరాతీశారు. పాత కక్షల కారణంగా ఈ హత్య జరిగి ఉంటుందని వారు భావిస్తున్నారు.

నిందితులను ఉపేక్షించం: ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

శేఖన్న భౌతికకాయాన్ని ఆదోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఎమ్మెల్యే పివి పార్థసారథి సందర్శించారు. నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారన్నారు. శేఖన్న కుటుంబానికి అండగా ఉంటానని తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.
94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

రాష్ట్రంలో కరువు ఉండకూడదు

- వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తాం
- 5.40 కోట్లతో 'సోమశిల'కు తక్షణమే మరమ్మతులు
- సిఎం నారా చంద్రబాబునాయుడు



సోమశిల ప్రాజెక్టును పరిశీలిస్తున్న సిఎం నారా చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

'ఒకప్పుడు దేశానికే అన్నపూర్ణగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉంది. అలాంటి రాష్ట్రం గత ప్రభుత్వ తప్పుడు విధానాలు, నిర్లక్ష్య ధోరణి కారణంగా వ్యవసాయం గడ్డు పరిస్థితులను ఎదుర్కొంది. రాష్ట్రంలో కరువు అనేది ఉండకూడదు. రైతులకు సాగు ఖర్చులు తగ్గించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుతాం. రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఏటా రూ.20 వేల సాయం అందిస్తాం. సోమశిల ప్రాజెక్టును సద్వినియోగం చేసుకునేలా బాధ్యత తీసుకుని పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం. నేను ఇక్కడికి రాకపోతే అధికారులు తూతూమంత్రంగా చర్యలు తీసుకుంటారన్న ఉద్దేశంతో వచ్చి పరిశీలించి ప్రాజెక్టు భద్రతకు చేపట్టాల్సిన చర్యలపై ఆదేశాలిచ్చాను.' అని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. నెల్లూరు సోమశిల ప్రాజెక్టును సోమవారం ఆయన పరిశీలించారు. మ్యాప్ పాయింటింగ్ ద్వారా ప్రాజెక్టు పరిస్థితి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులతో ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

'సోమశిల'కు మరమ్మతులు చేస్తాం

దెబ్బతిన్న సోమశిల గేట్లు రిపేరు చేయించి, ఆప్రాన్ నిర్మిస్తామని స్లూయిస్‌లో కూడా గోడ నిర్మిస్తామని సిఎం తెలిపారు. ప్రజావేదికలో పలువురు రైతులు తమ ప్రాంత సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం చంద్రబాబునాయుడు మాట్లాడుతూ... రూ.5.40 కోట్లతో 'సోమశిల' గేట్లు మరమ్మతులు చేయిస్తామన్నారు. రాష్ట్రంలోని ప్రాజెక్టుల మరమ్మతులకు రూ.300 కోట్లు ఖర్చు అవుతుందని, ఒక్క సోమశిలకే రూ.140 కోట్లు అవసరమవుతుందని చెప్పారు. గత ఐదేళ్లుగా ప్రాజెక్టుల స్థితిగతులను గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. 2018లో ప్రాజెక్టుకు నీళ్లు అనుకున్న స్థాయిలో రాకపోవడంతో పంటలు దెబ్బతింటాయని, శ్రీశైలం నుంచి 25 టిఎంసిలు తీసుకొచ్చి పంటలను కాపాడామని గుర్తు చేశారు. కండలేరులో కూడా 68 టిఎంసిలు నిల్వచేసుకొని మూడు లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఈ రెండు ప్రాజెక్టుల్లో నీరుంటే నెల్లూరు, కొంత తిరుపతి, ఉమ్మడి ప్రకాశం జిల్లాకు నీళ్లివ్వొచ్చని తెలిపారు. కృష్ణా నదిపై ఉన్న జలాశయాలన్నీ నీటితో కళ కళలాడుతున్నాయన్నారు. సర్వే రాళ్లపై బొమ్మలకు, రిషికొండ ప్యాలెస్ కు పెట్టిన ఖర్చులో సగం పెట్టినా ప్రాజెక్టులు పూర్తయ్యేవని వ్యాఖ్యానించారు. అసైన్డ్ భూములను 22ఏ నుండి ఫ్రీహోల్డ్ చేసి భూములు దోచేశారని ఆరోపించారు. తమ ప్రభుత్వంలో రాజకీయ కక్షలు ఉండవు...కానీ తప్పులు చేసిన వారు ఎక్కడ దాక్కున్నా వదలం అని చంద్రబాబు తెలిపారు. త్వరలో ఇసుక ర్యాంపులను పరిశీలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, జిల్లాలోని శాసనసభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



తాత్కాలిక నూతన భవనంలోకి మార్పు చేసిన విజయవాడ గుణదల ఇఎస్ఐ ఆస్పత్రిని పరిశీలిస్తున్న రాష్ట్ర కార్మిక, కర్మాగారాలు శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తదితరులు

ఇఎస్ఐ ఆస్పత్రులకు పూర్వ వైభవం తెస్తాం

- రాష్ట్ర కార్మిక, కర్మాగారాల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్
- 300 పడకలకు గుణదల ఆస్పత్రి విస్తరణ

ప్రజాశక్తి- విజయవాడ అర్బన్

ఇఎస్ఐ ఆస్పత్రులకు పూర్వ వైభవం తెస్తామని రాష్ట్ర కార్మిక, కర్మాగారాలు, బాయిలర్స్ అండ్ ఐఎంఎస్ శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. విజయవాడ గుణదల ఆస్పత్రిని 300 పడకలకు విస్తరించేందుకు, దానిలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. గుణదలలోని ఇఎస్ఐ ఆస్పత్రి ఆవరణలో నిర్మించిన తాత్కాలిక భవనాల్లోకి ఆస్పత్రిని మార్పు చేసే కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 1968లో ప్రారంభించి లక్షలాది కార్మిక కుటుంబాలకు వైద్య సేవలందిస్తూ ప్రస్తుతం 110 పడకలతో సేవలందిస్తున్న ఈ ఆస్పత్రిని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్రంలోని అన్ని ఇఎస్ఐ ఆస్పత్రులనూ దశల వారీగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. అన్ని రోగాలకూ సత్వర వైద్య సేవలందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పది మంది కార్మికులు ఉన్న ప్రతి సంస్థను ఇఎస్ఐ పరిధిలోకి తెస్తామని తెలిపారు. ఇఎస్ఐ సభ్యత్వాన్ని వచ్చే ఐదేళ్లలో 25 లక్షలు పెంచే లక్ష్యంలో పనిచేస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వం ఇఎస్ఐ ఆస్పత్రులను నిర్వీర్యం చేసిందని, కేంద్రం నుండి వచ్చిన నిధులను పక్కదారి పట్టించిందని, కార్మిక శాఖను భ్రష్టు పట్టించిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక, కర్మాగారాలు, బాయిలర్స్, ఐఎంఎస్ శాఖ ప్రభుత్వ కార్యదర్శి ఎం.ఎం.నాయక్, కార్మిక రాజ్య బీమా వైద్య సేవల డైరెక్టర్ వి.ఆంజనేయులు, ఇఎస్ఐసి ప్రాంతీయ సంచాలకులు ఎ.వేణుగోపాల్, ఎంఎల్‌సి పి.అశోక్‌బాబు, విజయవాడ తూర్పు ఎంఎల్ఎ గద్దె రామ్మోహన్‌రావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.జ్యోతి, ఆర్ఎంఒ డాక్టర్ ఉప్పులేటి తారక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ వారికి అందలం

- కెవిపిఎస్ ఖండన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

లేటరల్ ఎంట్రీ పేరుతో ఆర్‌ఎస్‌ఎస్ ప్రైవేటు మనుషులతో ఖాళీ ఐఎఎస్ పోస్టులు భర్తీ చేయడం మనువాద మతోన్మాద కుల దురహంకార చర్య అని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నల్లప్ప, అండ్ర మల్యాద్రి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను పక్కనబెట్టి ప్రైవేటు మనుషులతో దొడ్డిదారిన నింపే చర్యలను మతోన్మాద మోడీ ప్రభుత్వం తక్షణమే నిలిపేయాలని కోరారు.

సూరంపాలెం దళితులకు న్యాయం చేయాలి

కాకినాడ జిల్లా సూరంపాలెంలో దళితులపై మూడుసార్లు దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అండ్ర మాల్యాద్రి.. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోల బాలవీరాంజనేయస్వామికి వినతిపత్రం సమర్పించారు. ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ కమిటీ సమావేశాలు అన్ని స్థాయిల్లో జరపాలని, జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులు అమలుకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. సంక్షేమ పథకాలకు పూలే, అంబేద్కర్, గుర్రం జాషువా, పుచ్చలపల్లి సుందరయ్య, కుసుమ ధర్మన్న, ఎస్.ఆర్.శంకరన్ పేర్లు పెట్టాలని కోరారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న కెవిపిఎస్ నాయకులు



ఫొటో జర్నలిస్టులకు 'సిఎం క్లిక్'

185వ వరల్డ్ ఫొటోగ్రఫీ డే సందర్భంగా సోమవారం ఫొటో జర్నలిస్టులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కెమేరా క్లిక్ మనిపించారు. ఈ సందర్భంగా ఉండవల్లిలోని నివాసంలో ఆయనను కలిసిన ఫొటో జర్నలిస్టులతో ముచ్చటించి, వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు.

20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం

- ఫాక్స్‌కాన్ ప్రతినిధులతో మంత్రి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే తమ ప్రభుత్వం లక్ష్యమని విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. ఈ లక్ష్య సాధనలో ప్రధాన భూమిక పోషించాలని ఫాక్స్‌కాన్ ప్రతినిధులను కోరారు. ఆ కంపెనీ ప్రతినిధులతో ఉండవల్లిలోని తన నివాసంలో సోమవారం భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఉన్న అవకాశాలను వారికి లోకేష్ వివరించారు. మెగా మాన్యుఫ్యాక్చరింగ్ సిటీని ఏర్పాటు చేయాలని, పూర్తి సహకారం తాము అందిస్తామని లోకేష్ వారికి హామీ ఇచ్చారు. మెగా సిటీ ఏర్పాటుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇవి, ఎలక్ట్రానిక్ పాలసీలు తీసుకురాబోతున్నామని చెప్పారు. ఎలక్ట్రానిక్ వాహనాలు, సెమీ కండక్టర్లు, డిజిటల్ హెల్త్, మాన్యుఫ్యాక్చరింగ్ కంపోనెంట్స్ తయారీకి సంబంధించిన ప్లాంట్ల ఏర్పాటుకు సుముఖంగా ఉన్నామని మంత్రి లోకేష్‌తో కంపెనీ ప్రతినిధులు అన్నారు. త్వరలోనే తమ బృందం రాష్ట్ర అధికారులతో చర్చిస్తుందని వెల్లడించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ఐటి, ఎలక్ట్రానిక్స్ ముఖ్యకార్యదర్శి సౌరబ్ గౌర్, ఫాక్స్‌కాన్ భారత ప్రతినిధి విలీ, ఛైర్మన్ డైరెక్టర్ ఆఫీస్ సెంథిల్‌కుమార్, డిప్యూటీ డైరెక్టర్ భరత్ దండి, మేనేజర్ హనా వాంగ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కుటుంబాలకు అండగా ప్రభుత్వం

అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాస అనాథాశ్రమంలో కలుషితాహారం తిని మృతిచెందిన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి లోకేష్ తెలిపారు. విద్యార్థుల మృతి ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్లతో మాట్లాడానని తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 17 మంది విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు.

అన్న క్యాంటీన్లకు లోహిత్ రూ.కోటి విరాళం

అన్న క్యాంటీన్ల నిర్వహణకు టిడిపి కార్యకర్తల సంక్షేమ నిధి కో-ఆర్డినేటర్ శిష్టా లోహిత్ రూ.కోటి విరాళం అందజేశారు. టిడిపి ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్‌ను ఉండవల్లిలో కలిసి ఈ చెక్కును అందజేశారు. అన్న క్యాంటీన్ల కోసం లోహిత్ వంటి పారిశ్రామికవేత్తలు పెద్దయెత్తున ముందుకు రావడం సంతోషంగా ఉందని లోకేష్ ఈ సందర్భంగా అన్నారు.

జగనన్న భూసర్వే పెద్ద బోగస్

- మంత్రి అచ్చెన్నాయుడు, టిడిపి నేత కంభంపాటి


ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జగనన్న భూ సర్వే పేరుతో గత ప్రభుత్వం బోగస్ సర్వే నిర్వహించి ప్రజల మధ్య తగాదాలు పెట్టిందని వ్యవసాయశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు, టిడిపి ప్రధాన కార్యదర్శి కంభంపాటి రామ్మోహన్‌రావు విమర్శించారు. టిడిపి కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి వినతులను, అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌రావు, శివప్రసాద్ స్వీకరించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. ఒక ప్రభుత్వం మారిన తరువాత ప్రజల బాధలను ఈ స్థాయిలో చూడటం ఇదే మొదటిసారి అని చెప్పారు. వ్యవస్థలను చిన్నాభిన్నం చేసిందన్నారు.

ఒక సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకుని సొంత కార్యక్రమాలు నిర్వహించిందని తెలిపారు. దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రస్తుతం తమకు భూ సమస్యలపైనే వినతులు వచ్చాయని, వీటికి శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే భూ సదస్సులు నిర్వహించనుందని వెల్లడించారు. గత ఐదేళ్లలో ఇబ్బంది పడ్డ ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దోపిడీ, అవినీతి బయటకు వస్తుందనే భయంతో రికార్డులను తగలబెడుతున్నారని విమర్శించారు. పోలవరంలో నిర్వాసితులకు, నష్టపోయిన బాధితులకు పరిహారం గత ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. తన సొంత పార్టీ వారికి విపరీతంగా పరిహారం ఇచ్చి అక్రమంగా దోచుకున్నారని చెప్పారు. జగనన్న భూ సర్వే వల్ల తమ భూమిని ప్రభుత్వ భూమిగా మార్చి చూపిస్తున్నారని, అడంగల్ రావడం లేదని నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గానికి చెందిన సంజీవ వరప్రసాద్ ఫిర్యాదు చేశారు. వైద్యారోగ్యశాఖలో ఎఎన్ఎంలుగా పనిచేస్తున్న తమను గత ప్రభుత్వం దూర ప్రాంతాలకు బదిలీ చేసిందని తెలిపారు.

డిప్యూటీ సొలిసిటర్ జనరల్‌గా పసల

ప్రజాశక్తి-అమరావతి



హైకోర్టులో కేంద్ర ప్రభుత్వం తరపున వాదనలు వినిపించేందుకు డిప్యూటీ సొలిసిటర్ జనరల్‌గా న్యాయవాది పసల పొన్నారావు నియమితులయ్యారు. మూడేళ్లపాటు ఈ పదవిలో ఉంటారు. గతంలో ఈ పదవిని నిర్వహించిన ఎన్ హరినాథ్ గత సెప్టెంబరులో హైకోర్టు న్యాయమూర్తి అయ్యారు. ఎస్‌సి తరగతికి చెందిన వ్యక్తి డిప్యూటీ సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియాగా నియమితులు కావడం ఇదే తొలిసారి.

ఐదు ప్రాంతాల్లో మ్యూజియంలు

- అమరావతిలో రాష్ట్ర మ్యూజియం
- ప్రభుత్వ సన్నాహాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ప్రాచీన కట్టడాలు, అందులోని జ్ఞాపికలను భద్రపరిచేందుకు పెద్ద ఎత్తున రాష్ట్రంలో మ్యూజియంలను ఏర్పాటుచేయాలని రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇప్పటివరకు విజయవాడలోని బాపూ మ్యూజియం, అరకులో ట్రైబల్ మ్యూజియంతోపాటు, కొన్ని చోట్ల బౌద్ధ మ్యూజియంలు వంటివి మాత్రమే ప్రాముఖ్యత కలిగినవిగా ఉండగా, త్వరలో ఇతర ప్రాంతాల్లో కూడా పెద్ద సంఖ్యలో మ్యూజియంలను ఏర్పాటుచేయాలని నిర్ణయించారు.

కొత్తగా మూడు స్థాయిల్లో మ్యూజియంలను ఏర్పాటుచేయాలని భావిస్తున్నారు. వీటిల్లో రాష్ట్ర స్థాయి మ్యూజియంను అమరావతిలో ఏర్పాటుచేయనున్నారు. అలాగే పెద్ద మ్యూజియంలుగా తిరుపతి, కడప, మైలవరం, శ్రీకాకుళం, పెనుకొండల్లో ప్రతిపాదిస్తున్నారు. వీటికి అదనంగా ప్రతి జిల్లాలోనూ ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటుచేయాలని భావిస్తున్నారు. జిల్లాల్లోని స్థానిక చారిత్రాత్మక ప్రాంతాలకు సంబంధించిన పురావస్తు పరికరాలు, ఇతర శాసనాల వంటి అంశాలను వీటిల్లో భద్రపరచనున్నారు. . ఈ మ్యూజియంలను ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేయాలని యోచిస్తున్నారు. ఆడియో, వీడియో సహకారంతో ఆ ప్రాంతాల్లోని ప్రాముఖ్యతను వివరించేలా చూడాలని భావిస్తున్నారు. అలాగే ఏలూరు జిల్లాలోని రుద్రమకోట స్మారక సమాధులను కూడా అభివృద్ధి పరిచేందుకు సెప్టెంబర్ నుంచి నవంబర్ వరకు కార్యక్రమాలు నిర్వహించాలని కూడా నిర్ణయించారు.

కోటలపైనా దృష్టి

రాష్ట్రంలోని మూడు ప్రధాన, చారిత్రాత్మక కోటలను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. వీటిలో కృష్ణా జిల్లాలోని కొండపల్లి, చిత్తూరు జిల్లాలోని కంగుండి, గుంటూరు జిల్లాలోని కొండవీడు కోటలను అభివృద్ధికి గుర్తించారు. మ్యూజియంల ఏర్పాటులో ఈ ఆర్థిక సంవత్సరంలో ముందుగా అమరావతి, శ్రీకాకుళం, విజయనగరం, తిరుపతి, ఒంగోలుల్లోని మ్యూజియంలను ఏర్పాటుచేయాలని ప్రతిపాదిస్తున్నారు.

బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి - తిరువూరు : ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరులో ఇంటర్ విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిని తిరువూరు కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి 15 రోజులపాటు రిమాండ్ విధించారు. దీంతో అతడిని నూజివీడు సబ్ జైలుకు తరలించారు. అతనికి సహకరించిన ఇద్దరు బాలురను విజయవాడ జువైనల్ హోమ్‌కు తరలించారు. తిరువూరు సిఐ కె.గిరిబాబు కథనం ప్రకారం... విస్సన్నపేట మండలం నూతిపాడుకు చెందిన బాలిక తిరువూరులోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. అదే గ్రామానికి చెందిన యువకుడు తోట చందు ఆ బాలికకు మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడ్డారు. ఇందుకు ఇద్దరు మైనర్ బాలురులు సహాయం చేశారు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు ఆదివారం రాత్రి కేసు నమోదు చేశారు. నిందితుడిపై గతంలో రెడ్డిగూడెం మండలంలో ఓ కేసు, హైదారాబాద్‌లో ఓ మహిళను అల్లరిపాలు చేసిన కేసు ఉన్నాయి.

విస్సన్నపేట పోలీసుస్టేషన్‌లో కేసు కట్టలేదు : బాధితురాలి తల్లి

తన కుమార్తెను ముగ్గురు వేధిస్తున్నారని వారం రోజుల క్రితం విస్సన్నపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు బాధితురాలి తల్లి తెలిపారు. కేసు కట్టకుండా ఊళ్లోకెళ్ళి పంచాయతీ చేసుకోవాలని ఎస్ఐ సలహా ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషనర్‌ను కలిసి సంఘటన గురించి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

హైకోర్టుకు దువ్వాడ శ్రీనివాస్

ప్రజాశక్తి-అమరావతి

ఫిర్యాదు ఆధారంగా తన భార్య వాణి, పెద్ద కుమార్తె హైందవిపై పోలీసులు చర్యలు తీసుకోవడం లేదంటూ వైసిపి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తన ఫిర్యాదుపై చర్యలు తీసుకోని టెక్కలి సిఐ, ఎస్ఐపై విచారణకు ఆదేశించాలని, వారిపై శాఖాపరమైన చర్యలకు వీలుగా ఎస్‌పికి ఉత్తర్వులు ఇవ్వాలన్న వ్యాజ్యాన్ని జస్టిస్ బివిఎల్ చక్రవర్తి సోమవారం విచారణ జరిపారు. మూడు వారాల్లోగా కౌంటర్లు దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించారు. విచారణను 4 వారాలకు వాయిదా వేశారు. దువ్వాడ తరపున న్యాయవాది టిఎంకె చైతన్య వాదిస్తూ.. పిటిషనరు ఫిర్యాదుపై పోలీసులు దర్యాప్తు కూడా చేపట్టలేదన్నారు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని ప్రభుత్వ న్యాయవాది కృష్ణారెడ్డి చెప్పారు. వాణి, హైందవికి సిఆర్‌పిసి సెక్షన్ 41ఏ నోటీసులు జారీ అయ్యాయన్నారు.

సుప్రీం ఉత్తర్వులకు విరుద్ధంగా ఇసి

- హైకోర్టుకు బాలినేని

ప్రజాశక్తి-అమరావతి

ఇవిఎంలు, వివిప్యాట్ల తనిఖీ, పరిశీలన చేయకుండా, వాటికి బదులు మాక్ పోలింగ్ నిర్వహించేందుకు వీలుగా గత నెల 16 నాటి టెక్నికల్ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (టిఎస్ఒపి)కు చెందిన వివరాలు నివేదించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ఆదేశించింది. మంగళవారం విచారణ జరుపుతామని జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు సోమవారం వెల్లడించారు. ఇవిఎంలు, వివిప్యాట్ల తనిఖీలు, పరిశీలన స్థానంలో మాక్ పోలింగ్ నిర్వహించాలని ఇసి గత నెల 16న జారీ చేసిన టిఎస్ఒపి.. సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమంటూ వైసిపికి చెందిన మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు.

అత్యుత్తమ ఎకనామిక్ జోన్‌గా 'శ్రీసిటీ'

(మొదటి పేజీ తరువాయి)

పరిశ్రమలు, వాణిజ్య, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి. భరత్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి ఒక్కసారి కూడా శ్రీసిటీని సందర్శించలేదన్నారు. వచ్చే ఐదేళ్లలో చంద్రబాబు విజన్‌కు తగ్గట్టుగా రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. జపనీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సాడోసన్, టొరే ప్రతినిధి అజయ్ మాట్లాడుతూ కంపెనీలకు మరింత ప్రోత్సాహం ఇచ్చేందుకు ముఖ్యమంత్రి స్వయంగా రావడం సంతోషకరమన్నారు. ఇసుజు ప్రతినిధి మిట్టల్ మాట్లాడుతూ తమ పరిశ్రమ ఇప్పుడు 'లార్జెస్ట్ ఎక్స్‌పోర్టర్ ఆఫ్ కమర్షియల్ వెహికల్ ఫ్రమ్ ఇండియా' అయ్యిందన్నారు. లక్ష వాహనాలను మార్కెట్లో విడుదల చేసేందుకు సిద్ధమయ్యామని, ఆ కార్యక్రమానికి సిఎం మరోసారి ముఖ్యఅతిథిగా రావాలని కోరారు. డైకిన్ ప్రతినిధి నిమ్మగడ్డ కుటుంబరావు మాట్లాడుతూ శ్రీసిటీ నుంచి ప్రపంచంలోని అన్ని ప్రాంతాలకూ తమ ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత, డిజిపి ద్వారకా తిరుమలరావు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఫైర్ సర్వీసెస్ డిజి మాదిరెడ్డి ప్రతాప్, ఎస్‌పి సుబ్బారాయుడు, ఎమ్మెల్యేలు కోనేటి ఆదిమూలం, విజయశ్రీ, కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పాల్గొన్నారు. అమరావతి నుంచి రేణిగుంట విమానాశ్రయానికి విమానంలో వచ్చిన చంద్రబాబునాయుడు అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో శ్రీసిటీలోని హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. శ్రీసిటీ పర్యటన అనంతరం నెల్లూరు జిల్లాలోని సోమశిల ప్రాజెక్టును పరిశీలించేందుకు వెళ్లారు.

గోదావరిలో నీళ్లు మాయం

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్న విషయాన్ని ప్రస్తావించారు. 'పోలవరం ప్రాజెక్టు అంటే సిమెంటు, ఇసుక, కంకర, కాంట్రాక్టర్లే కాదని, దానికి సర్వం త్యాగం చేసిన వేలాది గిరిజన కుటుంబాలు కూడా... వారి బాధలు తెలుసుకునేందుకు వారిని ఎప్పుడూ సందర్శించలేదు' అని పేర్కొన్నారు.

తొందరపడితే అనర్థాలు

కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం త్వరగా పూర్తి చేయడానికి వీలుగా పాత కాంట్రాక్టరుకే అప్పగిస్తున్నారని మీడియా కథనాలు వచ్చాయని తెలిపారు. గోదావరి నదిమీద నిర్మాణమయ్యే అత్యంత క్లిష్టతరమైన ప్రాజెక్టును పటిష్టంగా నిర్మించడం ముఖ్యమని పేర్కొన్నారు. ఒకదాని తరువాత ఒకటి చేయాల్సిన పనులను త్వరగా పూర్తి చేయాలనే పేరుతో రాజకీయ అవసరాల కోసం తొందరజేస్తే, కాంట్రాక్టర్ల ప్రయోజనం కోసం నిపుణుల సలహాలను పెడచెవిన పెడితే ఇప్పటికి జరిగిన అనర్థాలు, ఆలస్యాలు, నష్టాలకన్నా ఇంకా ఎక్కువ జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రంలో గతంలో జరిగిన తప్పిదాల వల్ల వేల కోట్ల నష్టం జరిగిండదని వెల్లడించారని, వాటికి బాధ్యులెవరు, రాబట్టుకునేందుకు తీసుకునే చర్యలేమిటో బయటపెట్టలేదని, దీనివెనుక మర్మమేటితో బోధపడటం లేదని పేర్కొన్నారు. అందువల్ల వాస్తవాలను వెలికితీసేందుకు భవిష్యత్‌లో నష్టాలు, తప్పిదాలు జరగకుండా అవసరమైన చర్యలను సూచించేందుకు ఒక ఉన్నతస్థాయి స్వతంత్ర విచారణ కమిటీని నియమించాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో వేలాది గిరిజన కుటుంబాల భవిష్యత్ ముడిపడి ఉండటంతో పాటు, లక్షలాది దిగువ ప్రాంత ప్రజల పంటల రక్షణ సమస్య ఇమిడి ఉందని తెలిపారు. దీనివల్ల ప్రాజెక్టు, ప్రజల కోసం తాను సూచించిన ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందిస్తారని, ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తుందని ఆశిస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు.

బిల్లులు ఇవ్వమంటే కొట్టారు

- గుంటూరు అశ్వనీ ఆస్పత్రిపై ఎస్‌పికి బాధితుల ఫిర్యాదు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



మీడియాతో మాట్లాడుతున్న బాధిత మహిళలు

కిడ్నీ మార్పిడి వ్యవహారంలో తాము చెల్లించిన సొమ్ముకు బిల్లులు ఇవ్వకుండా కార్పొరేట్ ఆస్పత్రి నిర్వాహకులు ఇబ్బందులు పెడుతున్నారని గుంటూరుకు చెందిన మహిళలు సోమవారం జిల్లా ఎస్‌పికి ఫిర్యాదు చేశారు. బాధితుల వివరాల మేరకు...గుంటూరు డొంకరోడ్డు ఐదో లైనుకు చెందిన కోటపాటి లక్ష్మికి కిడ్నీలు చెడిపోయాయి. ఇటీవల ఆమె రక్తసంబంధీకుల నుంచి ఒక కిడ్నీ తీసుకుని స్థానిక అశ్వనీ ఆస్పత్రిలో కిడ్నీ మార్పిడి చేయించుకున్నారు. ఇందుకు ఆస్పత్రి యాజమాన్యం రూ.15 లక్షలు తీసుకుంది. ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నా భారీ మొత్తంలో సొమ్ము వసూలు చేసింది. బిల్లులు అడిగితే ఇవ్వడం లేదని లక్ష్మి కుమార్తె యడ్లపల్లి సునీత తెలిపారు. ఈ విషయంపై ఆస్పత్రి నిర్వాహకులను ప్రశ్నిస్తే సెక్యూరిటీ సిబ్బందితో తమను కొట్టించారని ఆరోపించారు. ఈ సందర్భంగా తనకు గాయాలు అయ్యాయని తెలిపారు. తల్లిని బతికించుకునేందుకు గతేడాది కిడ్నీ మార్పిడి చేయించామని, అయితే సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అయినా కొంత సొమ్ము తెప్పించుకునేందుకు బిల్లులు ఇవ్వమంటే ఇవ్వకుండా దురుసుగా ప్రవర్తించారని వాపోయారు. ఇంత వరకు ఒక్కరూపాయికి కూడా బిల్లులు ఇవ్వలేదన్నారు. ఈ నేపథ్యంలో పాత గుంటూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఆహారాన్ని వడ్డిస్తున్న పెమ్మసాని, ఎమ్మెల్యే నశీర్

పారిశ్రామికవేత్తల సహకారం అవసరం

- అన్న క్యాంటీన్లను పరిశీలించిన కేంద్ర మంత్రి పెమ్మసాని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పేదల ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్ల నిర్వహణకు పారిశ్రామికవేత్తలు, దాతల సహకారం ఎంతో అవసరం అని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు ఆర్‌టిసి బస్టాండ్ వద్ద గల అన్న క్యాంటీన్‌ను దుగ్గిరాలకు చెందిన పారిశ్రామికవేత్త, కాంటినెంటల్ కాఫీ కంపెనీ యజమాని రాజేంద్ర ప్రసాద్‌తో కలిసి ఆయన క్యాంటీన్ నిర్వహణను పరిశీలించారు. భోజనం ఏర్పాట్లు, రుచి, ఇతర సౌకర్యాల గురించి అక్కడ భోజనం చేస్తున్న వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో పెమ్మసాని మాట్లాడుతూ.. కేవలం రూ. ఐదులకే అన్నం పెట్టడం అంటే సాధారణ విషయం కాదన్నారు. అన్న క్యాంటీన్ భోజనం తాను కూడా రుచి చూశానని, చాలా బాగుందని కొనియాడారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్, కార్పొరేటర్ పోతురాజు సమత తదితరులు పాల్గొన్నారు.

శివ్వాం దళితుల సమస్యలు పరిష్కరించండి

- ప్రజాసంఘాల ఆధ్వర్యాన చలో కలెక్టరేట్
- అడ్డుకున్న పోలీసులు.. రహదారిపై బైఠాయింపు

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం శివ్వాం దళితుల భూమిని వారికి అప్పగించాలని రైతు, వ్యవసాయ కార్మిక, కెవిపిఎస్, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద గత 40 రోజులుగా నిరసన దీక్షలు కొనసాగిస్తున్నప్పటికీ అధికారులు స్పందించకపోవడంతో సోమవారం చలో కలెక్టరేట్‌కు పూనుకున్నారు. ఈ ధర్నాకు ఆయా సంఘాల నాయకులు అనుమతులు కోరినప్పటికీ, పోలీసులు నిరాకరించారు. గతంలో అధికారులు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ నేపథ్యంలో నాయకులను నిర్బంధించేందుకు సోమవారం తెల్లవారుజాము నుంచే పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. నాయకులను ఇళ్ల వద్దనే నిర్బంధించారు. ధర్నాకు వచ్చిన వారిని స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో అరెస్టు చేశారు. నిర్బంధాలను ఎదుర్కొని నాయకులు, శివ్వాం దళితులు బెలగాం రైల్వే స్టేషన్ నుంచి కలెక్టరేట్‌కు ర్యాలీ ప్రారంభించారు. దీనిని స్థానిక చర్చి జంక్షన్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఐదుగురికి మాత్రమే అధికారులతో మాట్లాడేందుకు అనుమతి ఇవ్వడంతో నాయకులు తిరస్కరించారు. అధికారులు బయటకు రావాలని పట్టుపట్టారు. పోలీసులు నిరాకరించడంతో ప్రజాసంఘాల నాయకులు, దళితులు రోడ్డుపైనే బైఠాయించారు. దీంతో పోలీసులు డిఆర్‌ఒ కేశవనాయుడు, ఆర్‌డిఒ హేమలతను అక్కడికి రప్పించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ.. సమస్య పరిష్కరించేందుకు తగు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. శివ్వాం భూముల్లో పంట ఎవరు వేయాలనేది రెండు రోజుల్లో రాతపూర్వకంగా తెలియజేస్తానని హామీ ఇచ్చారు. మరిన్ని గ్రామాల భూ సమస్యలను ఆయా మండలాల తహశీల్దార్లకు వివరించాలని, వారు ఆ సమస్యలను పరిష్కరించేలా కలెక్టరేట్ నుండి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. దీంతో, తాత్కాలికంగా కార్యక్రమాన్ని ముగిస్తున్నామని, సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యేంత వరకు దీక్షల శిబిరం మాత్రం కొనసాగిస్తామని నాయకులు తేల్చిచెప్పారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ.. పేదల భూముల సర్వే చేపట్టి న్యాయబద్ధంగా వారికి రావాల్సిన భూములను వారికి అప్పగించాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్తులో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, పలువురు ప్రజాసంఘాల నాయకులు, భూ బాధిత గ్రామస్తులు పాల్గొన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కె.మన్మథరావు, ఎఐజిఎస్‌ఎస్ సంఘ నాయుకులు సంగం, సిపిఐఎంఎల్ నాయుకులు బొత్స నర్సింగరావు సంఘీభావం తెలిపారు.



పోలీసులు అడ్డగించడంతో రోడ్డుపై బైఠాయించిన నాయకులు, దళితులు

నిలిచిన ఇవిఎంల వెరిఫికేషన్

- మాక్ పోలింగ్ మాత్రమే చూపుతామన్న కలెక్టర్
- అభ్యంతరం తెలుపుతూ బయటకు వచ్చిన వైసిపి ప్రతినిధులు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఇవిఎంలపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఎన్నికల కమిషన్‌కు ఒంగోలు వైసిపి అభ్యర్థి, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పెట్టిన దరఖాస్తుపై జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా సోమవారం వెరిఫికేషన్ చేపట్టారు. ఇసి ఆదేశాల మేరకు ఇవిఎంలలో మాక్‌పోలింగ్ మాత్రమే నిర్వహిస్తామని వైసిపి ప్రతినిధులకు కలెక్టర్ చెప్పారు. ఇందుకు అంగీకరిస్తే ఇవిఎంల డేటా డిలీట్ చేసి.. మాక్‌పోలింగ్ నిర్వహిస్తామన్నారు. దీనిపై వైసిపి నుంచి హాజరైన లోకేష్‌రెడ్డి, ఓగిరాల వెంకట్రావు, సోమిరెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇవిఎంలో ఉన్న ఓట్లకు, వివిప్యాడ్‌లో ఉన్న స్లిప్‌లను లెక్కించి తేడాలు గుర్తించాలని వారు కోరారు. ఇందుకు కలెక్టర్ అంగీకరించలేదు. ఇసి ఆదేశాల మేరకే మాక్‌పోలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. దీంతో వైసిపి వారు అక్కడి నుంచి బయటకు వెళ్లిపోవడంతో వెరిఫికేషన్ ప్రక్రియ నిలిచిపోయింది. ఇవిఎంలో నమోదైన ఓట్లను, వివి ప్యాడ్‌లో స్లిప్‌లను లెక్కించాలని కోరుతూ వైసిపి అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. మంగళవారానికి కేసు వాయిదా పడింది.

పల్నాడు జిల్లాలో వేర్వేరు ప్రమాదాలు

- ఐదుగురు దుర్మరణం

ప్రజాశక్తి - పిడుగురాళ్ల (పల్నాడు జిల్లా)

ఆగి ఉన్న లారీని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ముగ్గురు దుర్మరణం పాలైన ఘటన పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువు టోల్‌ప్లాజా వద్ద ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పిడుగురాళ్లలోని నారాయణ స్కూల్ ప్రాంతానికి చెందిన ఇందు (30) ట్యూషన్ టీచర్. బంధువుల పెళ్లి ఉండడంతో ఇందు తన కుమార్తె అమూల్య (15)ను తీసుకుని తనకు తెలిసిన నాగతేజరెడ్డి (25)తో కలిసి ద్విచక్ర వాహనంపై ఆదివారం సాయంత్రం గురజాలకు వెళ్లారు. పెళ్లి అనంతరం అర్ధరాత్రి 12 గంటల తర్వాత ముగ్గురూ కలిసి పిడుగురాళ్లకు బయలుదేరారు. టోల్‌గేట్ సమీపంలోకి రాగానే రోడ్డు పక్కన నిలిచి ఉంచిన లారీని ద్విచక్ర వాహనం బలంగా ఢీకొట్టడంతో ముగ్గురూ అక్కడికక్కడే మృతి చెందారు.

ఆర్‌టిసి బస్సును ఢీకొన్న కారు

పల్నాడు జిల్లా నరసరావుపేట ఎన్‌జిఒ కాలనీకి చెందిన కనుమూరి ఆంజనేయులు (75), బంధువులు, కుటుంబీకులైన మరో ముగ్గురు మహిళలు కలిసి చిలకలూరిపేటలో ఒక శుభకార్యానికి సోమవారం వెళ్లారు. మధ్యాహ్నం మూడు గంటల తర్వాత తిరిగి వస్తుండగా అమీన్‌సాహెబ్ పాలెం సమీపంలోకి రాగానే ముందున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న ఆర్‌టిసి బస్సును కారు ఢీ కొన్నది. దీంతో ఆంజనేయులుతోపాటు కారులో ఉన్న ఈపూరు మండలం ఆరేపల్లి ముప్పాళ్లకు చెందిన సూర పద్మావతి (55) అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవర్, మరో ఇద్దరు మహిళలు గాయపడ్డారు.



తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న నాయకులు, పేదలు

పట్టాలు నిజమైనవా? నకిలీవా? : సిపిఎం

- 15 రోజుల్లో పరిష్కరిస్తామన్న రెవిన్యూ అధికారులు

ప్రజాశక్తి - ముదిగుబ్బ

శ్రీ సత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలంలోని రాళ్ల అనంతపురం సమీపాన జెకె పల్లి పొలం సర్వేనంబర్ 33బి, 49 ఏ, 50, 51కు సంబంధించి పెత్తందారుల వద్ద ఉన్న పట్టాలు నిజమైనవా? లేక నకిలీవా? అనేవి తేల్చాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట పేదలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు నరసింహులు మాట్లాడుతూ.. రాళ్ల అనంతపురం గ్రామంలో ఆదివారం భూ పోరాటం చేస్తున్న సమయంలో కొందరు పెత్తందారులు వచ్చి తమకు పట్టాలు ఉన్నాయని వాగ్వాదానికి దిగారన్నారు. ఒకవేళ పట్టాలు ఉంటే సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్దకు తీసుకుని రావాలని చెప్పామని, అయితే వారు ఎవ్వరూ కార్యాలయం వద్దకు రాలేదన్నారు. వారి వద్ద పట్టాలు ఉన్నాయా? లేదా అన్న అనుమానం కలుగుతోందన్నారు. ఒకవేళ వారి వద్ద పట్టాలు ఉంటే అవి నకిలీవా? అసలైనవా? అనేది అధికారులు నిగ్గుతేల్చాలని కోరారు. స్పందించిన అధికారులు తమకు 15 రోజులు సమయం ఇవ్వాలని, ఆ లోపు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో నాయకులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సిఐటియు మండల కార్యదర్శి బండల వెంకటేష్, పోతులయ్య, ఆవాజ్ కమిటీ కార్యదర్శి బాబ్జాన్, నౌషాద్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి, వైసిపి శ్రేణుల ఘర్షణ

- వాటర్ ప్లాంట్ లీజు విషయమై వివాదం
- కారం, పెట్రోలు, డీజీల్‌తో దాడి
- పలువురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మైలవరం



ఆసుపత్రిలో క్షతగాత్రులు

మినరల్ వాటర్ ప్లాంట్ లీజు విషయమై తలెత్తిన వివాదం ఘర్షణకు దారి తీసింది. వైసిపి శ్రేణులపై టిడిపి శ్రేణులు పెట్రోలు, డీజీల్, కారంతో దాడికి దిగాయి. ఈ దాడి ఘటనతో ఎన్‌టిఆర్ జిల్లా మైలవరం మండల పరిధి కనిమెర్ల తండాలో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పోలీసుల వివరాల మేరకు..మైలవరం మండల పరిధిలోని కనిమెర్ల తండా, పోరాటనగర్, కత్తుల తండా, రెడ్డిగూడెం మండల పరిధిలోని నాగులూరు తండా ప్రజలకు తాగునీటిని అందించేందుకు దాతలు, గ్రామస్తుల సహకారంతో కనిమెర్ల తండాలో 1000 లీటర్ల సామర్థ్యం ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్‌ను 2020లో ఏర్పాటు చేశారు. ప్లాంట్ నిర్వహణ బాధ్యతలను నాలుగు సంవత్సరాల లీజుకుగానూ కనిమెర్ల గ్రామానికి చెందిన వైసిపి సానుభూతిపరుడు బాణావతు వాసు బాబు తీసుకున్నారు. లీజు గడువు 2024 సెప్టెంబర్ వరకు ఆయనకు ఉంది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఈ ప్లాంటును దక్కించుకునేందుకు గ్రామానికి చెందిన కొందరు టిడిపి నాయకులు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఈ క్రమంలో ప్లాంట్ నిర్వహణ బాధ్యతలను తమకు అప్పగించాలంటూ వాసు బాబుని బెదిరించారు. ప్లాంట్ విషయమై సోమవారం ఉదయం ఇరుగ్రూపుల మధ్య వాదోపవాదాలు జరుగుతున్న సమయంలో టిడిపి నాయకులు ఒక్కసారిగా పెట్రోలు, డీజీల్, కారం చల్లి, కర్రలు, రాడ్డులతో బాణావతు వాసుతో పాటు అతని కుటుంబ సభ్యులపై మూకుమ్మడిగా దాడి చేశారు. బాణావతు వాసు, బాణావతు శంకర్ తలలకు తీవ్ర గాయాలయ్యాయి. అజ్మీర జమలయ్య, లక్ష్మయ్య, అమల, భానుప్రియ, అంజయ్యలకు తీవ్రంగా గాయపడ్డారు. ఈ దాడి వెనుక రెడ్డిగూడెం మండల పరిధి నాగులూరు గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు విజయబాబు ప్రోద్బలం ఉన్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. మైలవరం పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. క్షతగాత్రులను మైలవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రెవెన్యూ సదస్సుల్లో 34 లక్షల పాస్ పుస్తకాల పంపిణీ !

- రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో తొలి విడత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా సెప్టెంబరు మొదటి వారంలో ప్రారంభించనున్న రెవెన్యూ సదస్సుల్లో ప్రభుత్వ చిహ్నంతో భూ యజమానులకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చేందుకు వీలుగా అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఇందు కోసం 34 లక్షల పాస్ పుస్తకాలు అవసరమవుతాయని ప్రభుత్వం ఇండెంట్ పెట్టినట్లు సమాచారం. గత వైసిపి ప్రభుత్వం జగన్ బొమ్మతో పంపిణీ చేసిన పట్టాదారు పాస్ పుస్తకాల్లో విస్తీర్ణం, భూ యజమాని పేర్లతోపాటు పలు అంశాల్లో తప్పులు నమోదైనట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. దీంతో పట్టాదారు పాస్ పుస్తకాల్లో దొర్లిన తప్పులకు సంబంధించి సిసిఎల్ఎ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తూ తప్పులు ఎక్కడ దొర్లాయ్ అనే అంశాన్ని రెవెన్యూ సిబ్బంది నిశితంగా పరిశీలించే పనిలో నిమగ్నమయ్యారు. ముఖ్యంగా అసైన్డ్, దేవాదాయ భూములు, భూ ఆక్రమణలు, రికార్డుల ట్యాంపరింగ్, వెబ్‌ల్యాండ్‌లో భూ యజమానుల పేర్ల మార్పు వంటి అంశాలకు సంబంధించిన అర్జీలు ప్రజల నుంచి భారీగా రావచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే తుది నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. రెవెన్యూ సిబ్బంది తప్పులను గుర్తించి, వాటిని సరిదిద్ది కొత్త పాస్ పుస్తకాలను మంజూరు చేయకపోతే భవిష్యత్తులో భూ సమస్య ఇంకా తీవ్రమవుతుంది.

వెబ్‌ల్యాండ్‌లో భూ యజమానుల పేర్లు తప్పుగా నమోదు చేయడం, విస్తీర్ణంలో తేడాలు పరిష్కరించలేదనే అభిప్రాయం ప్రజల్లో నెలకొంది. ఈ నేపథ్యంలోనే తాము అధికారంలోకి వస్తే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తామని కూటమి ప్రకటించింది. అందుకు అనుగుణంగా నూతనంగా ఆయా పాస్ పుస్తకాలను రద్దు చేసి వాటి స్థానంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారిక ముద్రతో ఉన్న వాటిని పంపిణీ చేస్తామని ప్రకటించింది. గతంలో జగన్ బొమ్మతో పంపిణీ చేసిన పాస్ పుస్తకాలను రెవెన్యూ అధికారులు భూ యజమానుల నుంచి వెనక్కి తీసుకున్నారు. రెవెన్యూ సదస్సుల్లో వైసిపి ప్రభుత్వం 22(ఎ) నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన భూములు, అసైన్డ్ భూములు, ఇనామ్, షరతుల గల పట్టా భూములకు సంబంధించి నిబంధనలకు విరుద్ధంగా పలు ప్రాంతాల్లో మినహాయించినట్లు ప్రజా దర్బార్‌లో పెద్దయెత్తున ఫిర్యాదులు అందుతున్నాయి.

భూముల రీసర్వే, రైతులకు పంపిణీ చేసిన భూ హక్కు పత్రాల వివరాలు

ఫేజ్	మొత్తం గ్రామాలు	వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసిన గ్రామాలు	మొత్తం భూ యజమానులు	ప్రింటింగ్ అయిన భూ హక్కు పత్రాలు	పెండింగ్ పత్రాలు	ఇకెవైసి పూర్తయిన బిహెచ్‌పి	పంపిణీ పెండింగ్	చేసినవి
ఫేజ్-1	2,000	2000	8,07,240	8,04,837	3,446	8,04,837	7,91,629	13,208
ఫేజ్-2	2,000	2,000	10,14,114	10,10,357	4,103	10,09,880	10,00,576	9,304
ఫేజ్-3	2,000	2,000	12,65,137	3,39,655	9,25,482	3,39,655	2,49,642	90,013
ఫేజ్-4	813	688	2,95,508	31,885	2,63,623	31,865	21,895	9,970
మొత్తం:	**6,813**	**6,688**	**33,81,999**	**21,86,734**	**11,96,654**	**21,86,237**	**20,63,742**	**1,22495**

సంపాదకీయం


ఇ.సి తీరు!

బిజెపి, మోడీ ప్రభుత్వ ప్రభావం కింద కేంద్ర ఎన్నికల సంఘం (ఇ.సి) పని చేస్తోందన్న భావనలకు శుక్రవారం అది విడుదల ఎన్నికల షెడ్యూల్ అద్దం పడుతుంది. 2019లో హర్యానాతోపాటే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించగా, ఈసారి మహారాష్ట్రను వదిలేయడం అక్కడ అధికారంలో ఉన్న ఎన్‌డిఎ పార్టీలు ఎన్నికలకు సిద్ధం కావడానికి మరింత సమయం ఇవ్వడానికేనని విపక్షాలు లేవనెత్తిన అనుమానాలకు ఇసి వద్ద సమాధానం లేదు. గతంలో జమ్మూ కాశ్మీర్ ఎన్నికల ప్రస్తావన లేదు, ఈ ఏడాది ఇప్పటికే షెడ్యూల్ ప్రకటించిన రెండు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, జార్ఖండ్, ఢిల్లీ మొత్తం ఐదు రాష్ట్రాలకు ఎన్నికలు నిర్వహించాలి, కాశ్మీర్‌లో అతధికంగా భద్రతా సిబ్బందిని మోహరించాలి అని ఇ.సి చేసిన వాదనలు అంతగా పొసగవు. గతంలో కూడా గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్‌లకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా హిమాచల్‌కు ముందుగా ప్రకటించి ఎప్పటికో గుజరాత్‌కు షెడ్యూల్ ఇచ్చారు. అప్పుడు ఇ.సి పక్షపాత వైఖరిపై విమర్శలు వెల్లువెత్తాయి. సందేహించినట్లుగానే ప్రధాని మోడీ అధికారికంగా గుజరాత్‌లో పలు ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలతోపాటు ప్రత్యర్థి పార్టీల నేతలను బిజెపిలో చేర్చుకొనే వరకు అమాంబాపతు 'రాజకీయ' పనులను చక్కబెట్టారు. అలాగే మహారాష్ట్రలో సైతం ఏదో జిమ్మిక్కు చేయాలన్న ఉద్దేశం బిజెపికి ఉందన్న భావన మరాఠా ప్రజల్లో బలంగా ఉంది.

మహారాష్ట్రను బిజెపి ప్రధానంగా చూస్తుంది. అక్కడ అధికారం కోసం గత ఐదేళ్లల్లో ఆ పార్టీ ఎన్ని కుయుక్తులు పన్నిందో దేశం చూసింది. పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపిని, ఉద్ధవ్ ధాకరే సారథ్యంలోని శివసేనను నిట్టనిలువునా చీల్చి పడేసి, ప్రభుత్వాన్ని పడగొట్టి, తాను వెనుకుండి చీలిక గ్రూపులతో సంకీర్ణ సర్కారును ప్రతిష్ఠించింది. బిజెపి అప్రజాస్వామిక చర్యలకు లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారు. 42 లోక్‌సభ సీట్లు ఉన్న ఎన్‌డిఎ బలాన్ని 17కు తగ్గించి విపక్ష కూటమి బలాన్ని 9 నుంచి 30 స్థానాలకు పెంచారు. లోక్‌సభ ఎన్నికల్లో వెల్లడైన తీవ్ర ప్రజా వ్యతిరేకతను అసెంబ్లీ ఎన్నికల్లో తగ్గించేందుకు తగిన సమయం కోసం మహారాష్ట్ర ఎన్నికల షెడ్యూల్‌ను దూరం జరపాలని ఇ.సి కి బిజెపి, మోడీ సర్కారు కన్నుగీటిందని తెలుస్తుంది.

జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీకి పదేళ్ల తర్వాత ఎన్నికలు జరుగుతున్నాయి. 2014 నవంబర్-డిసెంబర్ తర్వాత ఇప్పుడే. అప్పుడు పిడిపి నేత ముఫ్తి మహ్మద్ సయూద్ సిఎంగా పిడిపి-బిజెపి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది. 2016 జనవరి 7న సయూద్ మరణంతో కొన్ని రోజులు గవర్నర్ పాలన నడిచింది. అనంతరం మెహబూబా ముఫ్తి సిఎంగా సంకీర్ణ ప్రభుత్వం కొనసాగింది. 2018 జూన్‌లో బిజెపి మెహబూబా సర్కారుకు మద్దతు ఉపసంహరించడంతో సంకీర్ణ ప్రభుత్వం కుప్పకూలింది. కొన్ని పార్టీలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చినా నాటి గవర్నర్ అసెంబ్లీని రద్దు చేశారు. 2018 డిసెంబర్ 20 నుంచి రాష్ట్రపతి పాలన విధించారు. 2019లో రెండవ సారి కేంద్రంలో బిజెపి రాగానే జమ్మూ కాశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే రాజ్యాంగంలోని 370 ఆర్టికల్‌ను రద్దు చేసి జమ్మూ కాశ్మీర్ కేంద్ర పాలిత రాష్ట్రం, లడాఖ్‌లుగా విభజించారు. 2019, 2024 లోక్‌సభ ఎన్నికలు ఆ రాష్ట్రంలో నిర్వహించిన ఇ.సి, అసెంబ్లీ ఎన్నికలకు మాత్రం భద్రత పేరిట సాకులు చెప్పడం వెనుక కేంద్ర బిజెపి డైరెక్షన్ తప్పక ఉంటుంది. నియోజకవర్గాల పునర్విభజనలో బిజెపికి పట్టు ఉన్న జమ్మూ డివిజన్‌లో 7 అసెంబ్లీ స్థానాలు పెరగడం, ఆ పార్టీకి పట్టులేని కాశ్మీర్ లోయలో ఒక స్థానమే పెరగడం వెనుక కుట్ర జరిగిందన్న ఆరోపణలున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 114 స్థానాలుండగా 24 పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోనివి. హర్యానాలో ముఖ్యమంత్రుల మార్పు, జడలు విప్పిన అవినీతి లోక్‌సభ ఎన్నికల్లో బిజెపిని దెబ్బతీశాయి. గతంలో పదింటికి పది లోక్‌సభ స్థానాలు గెలుచుకున్న బిజెపి 2024లో ఐదింటిని కోల్పోయింది. హర్యానా భయం ఆ పార్టీకి పట్టుకుంది. ఇసిల నియామకం, ఎలక్టోరల్ బాండ్లు, ఇవిఎంలలో ఓట్ల తేడా, లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి పట్ల ఇసి వ్యవహరించిన ఉదాసీన వైఖరి వలన స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఇ.సి పట్ల ప్రజల్లో క్రమంగా అవిశ్వాసం గూడుకట్టుకుంటోంది. ఇది ప్రజాస్వామ్యానికే ప్రమాదం. ప్రస్తుత పరిణామాలు మరోసారి ఎన్నికల సంస్కరణల డిమాండ్‌ను ముందుకు తెస్తున్నాయి.

మహనీయుల మాట



సిద్ధాంతాలు లేని జీవితాన్ని గురించి చెప్పకోవడానికి ఏమీ ఉండదు. వాటి కోసం పోరాడటాన్ని మించిన గొప్ప ఆనందం మరొకటి ఉండదు.

- ఫైడల్ కాస్ట్రో



ఉద్యమాల మార్గదర్శి, అక్షరాల రూపశిల్పి ఎం.హెచ్

సందర్భం

తెలకపల్లి రవి

మోటూరు హనుమంతరావు స్మారక ఉత్తమ జర్నలిస్టు 23వ అవార్డు ప్రదానోత్సవ సభ ఆయన ఆదర్శ జీవితానికీ, అది మనకిచ్చే సందేశానికి సంబంధించిన అనేక అంశాలను కళ్ల ముందుంచుతుంది. ఎం.హెచ్ గా సుపరిచితులైన మోటూరు ఒక నిస్వార్థ ప్రజా నాయకుడు. కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత. సమర్థుడైన సంపాదకుడుగా, శక్తివంతమైన రచయితగా, ఉర్రూతలూపే ఉపన్యాసకుడుగా బహుముఖ ప్రజ్ఞాశాలి. సమిష్టి తత్వాన్ని అమలు జరిపిన క్రమశిక్షణా శీలి. అవగాహనలో, అనుభవంలో ఆరితేరినా తరాల అంతరం లేకుండా అందరితో ఆప్యాయంగా అభిమానంగా మెలిగిన అనురాగమూర్తి. సహచరులనూ, కార్యకర్తలనూ సామాన్య ప్రజలనూ సదా ఆదరిస్తూ సార్థక జీవితం గడిపిన సంయమనశీలి. రాజకీయ వ్యక్తిగత హుందాతనానికి అర్థం చెప్పిన సంస్కారి. ఆటుపోట్లకు, అవరోధాలకు తల వంచని ధీశాలి. తెలుగు నాట ఎందరో రాజకీయ నేతలూ, పాత్రికేయ ప్రముఖులూ ప్రసిద్ధులూ వున్నా ఇన్ని ప్రత్యేకతల కలబోత గనకే ఎం.హెచ్ అందరి గౌరవం పొందగలిగారు. ప్రగతిశీల కళాసాహిత్య ఉద్యమాలపై ఆయనది ప్రత్యేక ముద్ర. ఆయన స్మారకార్థం అవార్డును నెలకొల్పి క్రమం తప్పకుండా కొనసాగిస్తున్న ప్రజాశక్తి యాజమాన్యం అందుకు ఎంతైనా అభినందనీయురాలు. ఆయన కన్నుమూత తర్వాత గడచిన ఇరవై ఏళ్లకు పైగా కాలంలో ఈ కృషి కొనసాగుతున్నది.

గుంటూరు (ప్రస్తుతం బాపట్ల) జిల్లా వెల్లటూరులో 1917లో పుట్టిన మోటూరు బాల్యంలోనే స్వాతంత్ర్య పోరాటం సామ్యవాద ఆశయాల వైపు ఆకర్షితులై ఆఖరి శ్వాస వరకూ అచంచలంగా కొనసాగారు. ఎం.హెచ్. వ్యాసాలు రాయడం, అనువాదాలు చేయడం 1941-42 రహస్య కాలంలో ప్రారంభించారు. తొలి ప్రజాశక్తి 1948లో పాలక వర్గాల నిషేధానికి గురైన తర్వాత ఉద్యమావసరాల కోసం జనత అనే పత్రిక తీసుకువచ్చే ప్రయత్నం జరిగినప్పుడు దాని తొలి సంపాదకీయం రాశారు గానీ ఇంతలోనే అరెస్టయ్యారు. బొమ్మారెడ్డి, ప్రసిద్ధ రచయిత గంగినేని వెంకటేశ్వరరావు దాన్ని నిర్వహించారు. ఈ సంగతి కూడా చాలా దశాబ్దాలు గడిచాక అనుకోకుండా జనత తొలి పలుకు చదివి ఇది మీ శైలిలా వుందని అడిగితే ఆయనకు ఇదంతా గుర్తుకు వచ్చింది. 1952 ఏప్రిల్‌లో ప్రజాశక్తి స్థానంలో విశాలాంధ్ర ఏర్పడింది. అదే 1952లో మంత్రి కల్లూరి చంద్రమౌళిని ఓడించి రేపల్లె నుంచి తొలిసారి శాసనసభకు ఎన్నికైన ఎం.హెచ్ ఏడాదిలోనే విశాలాంధ్ర సంపాదకుడయ్యారు. సాహిత్య పత్రికా విషయాల్లో పేరెన్నిక గన్న అప్పటి సంపాదకుడు మద్దుకూరి చంద్రశేఖరరావు (చంద్రం) ఉమ్మడి పార్టీ రాష్ట్ర కార్యదర్శి కావడంతో ఎం.హెచ్ సంపాదక బాధ్యత స్వీకరించారు. తర్వాత దాదాపు అర్ధ శతాబ్ది పాటు ఆయన వివిధ రూపాల్లో ఉద్యమ పత్రికల నిర్వహణ, రూపకల్పన, రచనల్లో కీలక పాత్ర వహించారు. 2001లో కన్ను మూసిన ఎం.హెచ్ జీవిత విశేషాలను జూన్ 18న వర్థంతి సందర్భంగా ప్రజాశక్తి గుర్తు చేసింది. ఈ అవార్డు ప్రదానం సందర్భంగా పత్రికా రంగానికి సంబంధించిన కోణాలు చెప్పుకుందాం.

కలమే కరవాలంగా....

1953-55 తన సంపాదకత్వం మూడు పువ్వులూ ఆరు కాయలుగా సాగిందని ఎం.హెచ్ అనేవారు. తన చెణుకులూ వ్యాఖ్యలూ విమర్శలూ పదునుగా నడిచేవి. తెలుగు నుడికారంలో సహజ సిద్ధమైన పట్టు గల ఎం.హెచ్ కలాన్ని చాలా వాడిగా వాడేవారు. దాదాపు అధికారంలోకి వచ్చేంత బలంతో కమ్యూనిస్టు పార్టీ కాంగ్రెస్‌ను హోరాహోరీ సవాలు చేస్తున్న నిత్య రాజకీయ పోరాటం. తీవ్ర సంఘర్షణ. అలాంటి దశలో ఎం.హెచ్ సంపాదకీయాలతో పాటు కంచు కాగడా శీర్షిక, పలుకులూ ములుకులూ వంటి శీర్షికలు నిర్వహించేవారు. నార్ల వెంకటేశ్వరరావు నాటి ఆంధ్రప్రభతో సహా కమ్యూనిస్టులపై చేసే దాడిని ఎదుర్కోవలసిన దశ. ఇప్పటి వివాదాల కంటే సూటిగా కమ్యూనిస్టులను ఓడించమంటూ పిలుపునిచ్చేవారు. ఇతర కారణాలకు తోడు ఈ దుష్ప్రచారాలూ పని చేసి 1955 ఎన్నికలలో కమ్యూనిస్టులు అధికారంలోకి రాకపోయినా 35 శాతం ఓట్లు తెచ్చుకోగలి గారు. కొందరిలో ఆ నిరుత్సాహం, సైద్ధాంతిక విభేదాల మధ్య ఎం.హెచ్ సంపాదక బాధ్యతల నుంచి తప్పుకోవడం, ఉద్యమం కోసం మళ్లీ బాధ్యతలు తీసుకోవడం చేస్తూ వచ్చారు. ఏమైనా ఆయన రచనల పదును ఇంకా నిశితమవుతూ వచ్చింది. ఆ సమయంలోనే విశాలాంధ్ర నిర్వహణలో డివి సుబ్బారావు, గోళ్ల రాధాకృష్ణమూర్తి, ఎల్. జోగారావు వంటి వారు ముఖ్య పాత్ర వహించారు. భారత్ చైనా సరిహద్దు వివాదం, కమ్యూనిస్టు ఉద్యమ అంతర్గత పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వం ఎం.హెచ్ తో సహా నాయకులను నిర్బంధించింది. ఈ ఒడుదుడుకుల మధ్య డివి సుబ్బారావు కీలక కృషితో ఎబికె ప్రసాద్ సంపాదకుడుగా జనశక్తి వారపత్రిక ప్రారంభమైంది. కొద్ది కాలంలోనే డివిఎస్, ఎబికె కూడా అరెస్టవడంతో బయట వున్న నండూరి ప్రసాదరావు, బొమ్మారెడ్డి తదితరుల సాయంతో దాన్ని నిర్వహించారు. తీవ్ర క్యాన్సర్‌కు గురైన డివిఎస్‌ను ఎంతో ఒత్తిడి తర్వాత విడుదల చేసినా...1966లో డిటెన్యూగానే కన్నుమూసిన త్యాగజీవి డివిఎస్‌ను ఎం.హెచ్ ఎప్పుడూ గుర్తు చేసేవారు.



> **"ఎం.హెచ్ గా సుపరిచితులైన మోటూరు ఒక నిస్వార్థ ప్రజా నాయకుడు. కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత. సమర్థుడైన సంపాదకుడుగా, శక్తివంతమైన రచయితగా, ఉర్రూతలూపే ఉపన్యాసకుడుగా బహు ముఖ ప్రజ్ఞాశాలి. సమిష్టి తత్వాన్ని అమలు జరిపిన క్రమశిక్షణా శీలి. అవగాహనలో, అనుభవంలో ఆరితేరినా తరాల అంతరం లేకుండా అందరితో ఆప్యాయంగా అభిమానంగా మెలిగిన అనురాగమూర్తి. సహ చరులనూ, కార్యకర్తలనూ సామాన్య ప్రజలనూ సదా ఆదరిస్తూ సార్థక జీవితం గడిపిన సంయమనశీలి. రాజకీయ వ్యక్తిగత హుందాతనానికి అర్థం చెప్పిన సంస్కారి. ఆటుపోట్లకు, అవరోధాలకు తల వంచని ధీశాలి. ప్రగతిశీల కళాసాహిత్య ఉద్యమాలపై ఆయనది ప్రత్యేక ముద్ర. ఆయన స్మారకార్థం అవార్డును నెలకొల్పి క్రమం తప్పకుండా కొనసాగిస్తున్న ప్రజాశక్తి యాజమాన్యం అందుకు ఎంతైనా అభినందనీయురాలు."**

మళ్లీ ప్రజాశక్తికి స్వాగతం!

1967 ఎన్నికల నాటికి జనశక్తిని దినపత్రికగా నడపాలని ఎం.హెచ్, జోగారావు రాజ్‌కోట వెళ్లి ముద్రణ యంత్రాన్ని కొనుక్కొచ్చారు. ఈ లోగా ఉద్యమంలో మరోసారి వచ్చిన విభేదాలతో జనశక్తి యాజమాన్యం మారడంతో సిపిఎం ఆధ్వర్యంలో 1968 జనవరి 27 ప్రజాశక్తి వారపత్రికగా పున:ప్రారంభమైంది. 1966 నుంచి 1982 వరకూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన ఎం.హెచ్ ఈ సమయంలోనూ కీలకమైన రచనలు చేశారు. బొమ్మారెడ్డి సంపాదకుడుగా వెలువడిన ప్రజాశక్తి వారపత్రికలో తొలుత పాటూరు రామయ్య వుండగా కొంత కాలం వాసిరెడ్డి సత్యనారాయణ పనిచేశారు. తుమ్మల వెంకట సుబ్బయ్య మేనేజరుగా వుండేవారు. 1975లో ఎమర్జన్సీ సమయంలో ఆయన రవి, అంజి వంటి తన పాత కలం పేర్లతో చేసిన రచనలు ఎంతో ప్రభావ శీలంగా వుండేవి. వాటిలో రాజు వెడలె... అంటూ సంజయ్ గాంధీపై చేసిన వ్యంగ్య రచన వంటివి నాటి పాఠకులు మర్చిపోలేరు. 1977 తర్వాత నేనూ వారపత్రికలో చేరాను. అప్పటికి ఎం.హెచ్, బొమ్మారెడ్డి అరవైలలో వుంటే నేను అప్పుడే ఇరవై దాటుతున్న స్థితి. అయినా ఎంతగానో ఆదరించి ప్రోత్సహించారు. కాలమంతటా ఎడాపెడా సైద్ధాంతిక పెడ ధోరణులపై ఆయన గొప్ప పోరాటం చేశారు. 1981 ఆగస్టు 1న ప్రజాశక్తి దినపత్రికగా మారింది. "వారపత్రికగా సెలవు, దినపత్రికగా మీ సేవకు సిద్ధం. సెలవివ్వవలసిన వారు మీరు, స్వాగతం పలకాల్సిన వారూ మీరే" అని ఎం.హెచ్ రాశారు. ఇందులోనే తన శైలీ విన్యాసం మనం చూడొచ్చు. ఈ కాలంలో శాసనమండలికీ రాజ్యసభకూ కూడా ఎన్నికై సవ్యసాచిగా బాధ్యతలు నిర్వహించారు. "అవి వారపత్రికలయినా, దినపత్రికలయినా, నా పేరిటే అవి నడిచినా నడవకపోయినా నేను జైలులో వున్నా రహస్యంగా వున్నా శాసనసభ్యుడుగా వున్నా పార్టీ కార్యదర్శిగా వున్నా విశాలాంధ్రకూ జనశక్తికీ, ప్రజాశక్తికీ నా రచనలూ సంపాదకీయాలూ అందుబాటులో వుంటూ వచ్చాయి" అని తన జ్ఞాపకాల్లో రాశారు.

ఆయన చూపిన బాటలో..


ప్రజాశక్తి దినపత్రికగా పున:ప్రారంభమైనప్పుడు నడపడం కష్టమని చాలామంది వ్యాఖ్యానించారుగానీ ఎం.హెచ్ అనుభవం, నాయకత్వ సహకారం దాన్ని విజయవంతంగా విస్తరించేందుకు బాట వేశాయి. రాజకీయంగానూ లౌకిక ప్రజాస్వామ్య పరిరక్షణలో అది ముందు నిలిచింది. మారిన పరిస్థితుల్లో అనేక నూతన ప్రయోగాలు, చొరవల వల్లనే ఇది సాధ్యమైంది. ఉద్యమ పితామహుడైన సుందరయ్య గారు, లావు బాలగంగాధరరావు, కొరటాల సత్యనారాయణ, రాఘవులు వంటి నాటి కార్యదర్శులు ఈ కృషికి తోడు నిలిచారు. యాజమాన్యంలో మళ్లీ, గోళ్ల రాధాకృష్ణమూర్తి, తర్వాత వి.కృష్ణయ్య ఆ యా దశల్లో జనరల్ మేనేజర్లుగా ముఖ్య పాత్ర వహించారు. ఇలా ఎందరో సీనియర్లు, యువత, కొత్త వారు పాలుపంచుకున్నారు. గనకే ప్రజాశక్తి నిలదొక్కుకోగలిగింది. ఎన్నో పత్రికలు మూతపడ్డాయి గాని ప్రజాశక్తి నిర్విఘ్నంగా కొనసాగిందంటే ఇదే పునాది. 1990లలో ప్రజాశక్తి పురోగమనం వేగం పుంజుకుంది. ఉద్యమ కుటుంబం నుంచి వచ్చాను గనక చిన్నప్పటి నుంచి ఒక స్ఫూర్తిగా భావిస్తున్న ఎం.హెచ్ వంటి దిగ్గజంతో రెండు దశాబ్దాలు సన్నిహితంగా మెలగడం, కొన్నేళ్లు సహ సంపాదకుడుగా వుండటం నాకు లభించిన గొప్ప అవకాశం. ఆఫీసుకు రాగానే ఆయన గదికి వెళ్లగానే కాఫీ తాగి రాజకీయాలు, సాహిత్యం, చరిత్ర విషయాలు, అనుభవాలు తెలుసుకోవడం మరచిపోలేని అనుభవం. క్లిష్ట పరిస్థితులను, సమస్యలను సమన్వయం చేయగల వాస్తవికత ఆయన స్వంతం. తర్వాత కాలంలో నేను బుక్‌హౌస్ బాధ్యతలకు వెళ్లగా వి.శ్రీనివాసరావు మొదట ఎగ్జిక్యూటివ్ ఎడిటర్‌గా, 2001 తర్వాత పూర్తి స్థాయి సంపాదకుడుగా ప్రజాశక్తి బాధ్యతలు చేపట్టారు. శ్రీనివాసరావు ఢిల్లీ వెళ్లాక ఎస్.వినయ కుమార్ సంపాదకుడుగా పనిచేశారు. 2013లో మళ్లీ నేను పత్రిక సంపాదక బాధ్యతల్లో వుండగా రాష్ట్ర విభజనతో పాటూరు రామయ్య ఎడిటర్‌గా ఎస్.వెంకట్రావు ఎగ్జిక్యూటివ్ ఎడిటర్‌గా ప్రజాశక్తి విజయవాడకు మారింది. 2018 నుంచి ఎం.వి.ఎస్.శర్మ, ప్రస్తుతం తులసీదాస్ సంపాదకులుగా ఎం.హెచ్ ఒరవడిని కొనసాగిస్తూ వస్తున్నారు. మా అందరికీ ప్రేరణ ఎం.హెచ్ అన్నది నిజం. ఆయన కుటుంబం మొత్తం అదే బాటలో కొనసాగించడం మరింత విశేషం.

రాజకీయంగా రాజీ పడని సైద్ధాంతిక స్పష్టత పాటిస్తూనే భిన్నాభిప్రాయాలను గౌరవించడం, ప్రజాస్వామిక ప్రమాణాలను అనుసరించడం ఇందుకు కారణమైంది. మీడియా విస్తరణ తర్వాత నిట్టనిలువునా చీలిపోయి అసత్యాలు అసభ్యతలు తాండవిస్తున్న నేటి తరుణంలో ఎం.హెచ్ పెట్టిన వరవడి ప్రజాశక్తిని విభిన్నంగా నిలబెట్టగలిగింది. అంతర్జాతీయంగా సోషలిస్టు శక్తులకు ఎదురుదెబ్బ తగిలినప్పుడు, జాతీయంగా మతతత్వ రాజకీయాల ముప్పు ఎదుర్కొనవలసి వచ్చినప్పుడు ఇదే దీక్షా పటిమ ప్రత్యామ్నాయం చూపగలిగింది. రాజకీయంగా విభేదించేవారు కూడా ప్రజాశక్తి విశ్వసనీయతను ప్రశంసిస్తారు. మోటూరు స్మారక అవార్డు ఆశయాలను ముందుకు తీసుకుపోవడానికీ, ప్రజా పాత్రికేయ విలువలు పెంపొందించడానికి మార్గం చూపు తుందని ఆశిద్దాం. పాలక వర్గాల పాచికలనూ ప్రపంచీకరణ తాకిడిని, మత మార్కెట్ తత్వాల సవాళ్లనూ ఎదుర్కొంటూ ప్రతి అక్షరం ప్రజల పక్షంగా ముందుకు సాగుదాం.

/ నేడు మోటూరు హనుమంతరావు స్మారక ఉత్తమ జర్నలిస్టు 23వ అవార్డు ప్రదానోత్సవ సభ విజయవాడ లోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతున్న సందర్భంగా. /

శాస్త్రీయ ఆలోచన నేటి అవసరం...

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 ఏ సబ్ సెక్షన్ 11 ప్రకారం ప్రతి పౌరుడు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి. కానీ ఇది ఆచరణలో అమలు కావడం లేదు. సాధారణ ప్రజలే కాదు. శాస్త్రవేత్తలు, ప్రభుత్వం కూడా ఈ భావనలను విస్మరిస్తున్నది. శాస్త్ర, సాంకేతికతను ఉపయోగించి శాస్త్రవేత్తలు రాకెట్లను తయారు చేస్తున్నారు. కాని ముందుగా దేవాలయంలో పూజలు చేసిన అనంతరం దీన్ని ప్రయోగిస్తున్నారు. ప్రయోగం సక్సెస్ అయితే వీరి ఖాతాలో వేసుకుంటున్నారు. ఫెయిల్ అయితే దేవుడి ఖాతాలో వేసేస్తున్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత శాస్త్రీయ భావాలకు బదులు అశాస్త్రీయ భావాలను ఎక్కువగా విస్తరింపచేస్తున్నది.



అభిప్రాయం

మనిషి నిస్సహాయ స్థితిలో ఉన్నప్పుడు మొదట ప్రకృతిని ఆరాధించడం మొదలుపెట్టాడు. ఈ ఆరాధన భక్తి, మతం ఆవిర్భావానికి బాటలు వేసింది. మతం విజ్ఞానానికి బదులు అజ్ఞానాన్ని ప్రజల్లో నింపింది. మూఢనమ్మకాలు, చేతబడులు, క్షుద్ర పూజలు, మంత్ర తంత్రాలు మొదలైనవి మతం సృష్టించిన అజ్ఞానంలో నుంచి పుట్టినవే. ఇప్పటికీ మారుమూల గ్రామాల్లో, ప్రాంతాల్లో ఈ మూఢనమ్మకాలను పాటిస్తున్నారు. కొన్ని సందర్భాలలో అవి హత్యలకు కూడా దారి తీస్తున్నాయి. శాస్త్ర సాంకేతిక రంగం అభివృద్ధి చెందుతున్న నేటి సమాజంలో మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా సైంటిఫిక్ టెంపర్ (శాస్త్రీయ దృక్పథం)పై ప్రజల్లో అవగాహన కల్పించాలి. భారతదేశ మొదటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ మొదటిసారిగా సైంటిఫిక్ టెంపర్ అనే పదాన్ని "ద డిస్కవరీ ఆఫ్ ఇండియాలో" ప్రస్తావించారు. హేతువాది, రచయిత డా॥నరేంద్ర దభోల్కర్ మూఢనమ్మకాలు, చేతబడి పద్ధతులను నిర్మూలించడానికి సైంటిఫిక్ టెంపర్‌ను ప్రచారం చేయడానికి గొప్ప కృషి చేశారు. మంత్రాల ద్వారా వ్యాధులు నిర్మూలిస్తామని చెప్పుకునే స్వామీజీలకు, తాంత్రికులకు వ్యతిరేకంగా ప్రచారం చేయడమే కాకుండా "మూఢనమ్మకాలు, చేతబడి వ్యతిరేక ఆర్డినెన్స్"ను రూపొందించడంలో కీలక పాత్ర పోషించారు. మతం అజ్ఞానాన్ని ప్రచారం చేస్తే సైన్స్ విజ్ఞానాన్ని ప్రచారం చేస్తుంది. ఈ రెండూ ఒకదానికొకటి పూర్తిగా వ్యతిరేకం. సైన్సును ప్రచారం చేస్తున్నాడని నరేంద్ర దభోల్కర్‌ను 2013 ఆగస్టు 20న సనాతన్ అనే సంస్థ ఆయనను హత్య చేసింది. ఆయన హత్యకు గురయిన రోజును "నేషనల్ సైంటిఫిక్ టెంపర్ డే"గా పాటించాలని "ఆలిండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్" పిలుపునిచ్చింది.

ఇప్పటికే మన దేశంలో అనేక మూఢనమ్మకాలు పాటిస్తున్నవారు అధిక సంఖ్యలో ఉన్నారు. బోలే బాబా పాద 'ధూళి' (స్థానిక పరిభాషలో రాజ్) సేకరించి, దానిని వంటికి రాసుకుంటే శరీరంలో ఉన్న రోగాలన్నీ నయం అవుతాయని ప్రజలను నమ్మించారు. అలా ఆ ధూళిని సేకరించడానికి వెళ్లి 121 మంది ప్రాణాలు కోల్పోయారు. ఒక కుటుంబంలో ఏదైనా కష్టం వస్తే ఎవరైనా చనిపోతే దానికి కారణం ఇంటి నిర్మాణం వాస్తు ప్రకారం జరగలేదని ఎవరో చెప్తే ఎందుకు? ఏమిటి? అని ఆలోచించకుండా లక్షలు పెట్టి కట్టుకున్న ఇంటిని కూల్చి కొత్త ఇల్లు కడుతున్నారు. అంతెందుకు? గతంలో తెలంగాణ ముఖ్యమంత్రి కూడా వాస్తు బాగోలేదని నూతన సెక్రటేరియట్ భవనాన్ని ఏర్పాటు చేశారు. చేతి రేఖలను బట్టి భవిష్యత్తు చెప్తామంటారు. అసలు చేతులే లేనివాళ్ళు ఎందరో ఉన్నారు. వారికి అసలు భవిష్యత్తు ఉండదా! నికోలాస్ జేమ్స్ విజిసిక్ లాంటి వాళ్ళు ఎందరో చేతులు లేనప్పటికీ గొప్ప గొప్ప విజయాలు సాధించారు. కాబట్టి చేతి రేఖలు భవిష్యత్తును తెలపవు. మానసికంగా అనారోగ్యానికి గురైన వారు వింతగా ప్రవర్తిస్తుంటారు. వీరికి చేతబడి జరిగిందంటూ, దెయ్యం పట్టిందంటూ నిర్ణయించేసి వారిని కట్టి పడేయడం, చిత్రహింసలకు గురి చేయడం చూస్తున్నాం. మానసికంగా స్థిరంగా లేని వారిని మరింతగా మానసికంగా, శారీరకంగా హింసించి పిచ్చివారిని చేస్తుంటారు. జ్వరం వస్తే చర్చి ఫాదర్ దగ్గరకు వెళ్తారు. ఆయన కొంచెం రొట్టె, జూస్ ఇచ్చి ప్రార్థన చేసి 'తగ్గిపోతుందిలే' అంటే నమ్మేస్తారు. కాని అదే ఫాదర్‌కి జ్వరం వస్తే హాస్పిటల్‌కి వెళ్లి వైద్యం చేయించుకుంటారు. బలిస్తే స్వర్గానికి వెళ్తామని, ఐశ్వర్యం కలుగుతుందనే మూఢనమ్మకంతో నరబలులు ఇస్తుంటారు. ఆర్థిక శ్రేయస్సు కలుగుతుందని నరబలి ఇవ్వాలని మాంత్రికుడు చెప్తే మంత్ర విద్యలో భాగంగా ఇద్దరు మహిళలను కిడ్నాప్ చేసి తలలు నరికి గుంతలో పూడ్చి పెట్టారొక చోట. ఇంకొక దగ్గర స్వర్గానికి వెళ్తారంటే కన్న బిడ్డలనే చంపుకున్న మూర్ఖులున్నారు ఈ దేశంలో. ఫ్యాన్సీ నెంబర్ ఉంటే లక్ష్మీదేవి ప్రాప్తిస్తుందంటూ లక్షలు పెట్టి ఫ్యాన్సీ మొబైల్ నెంబర్లు కొనుక్కునే తంతు ఇప్పుడు నడుస్తున్నది. మొబైల్ నెంబర్లే కాదు. వాహనాలకు ఫ్యాన్సీ నెంబర్ కోసం వేలకు వేలు ఖర్చు పెడుతున్నారు. ఇలా ఒకటి కాదు. చెప్పుకుంటూ పోతే కోకొల్లలు.

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 ఏ సబ్ సెక్షన్ 11 ప్రకారం ప్రతి పౌరుడు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి. కానీ ఇది ఆచరణలో అమలు కావడం లేదు. సాధారణ ప్రజలే కాదు. శాస్త్రవేత్తలు, ప్రభుత్వం కూడా ఈ భావనలను విస్మరిస్తున్నది. శాస్త్ర, సాంకేతికతను ఉపయోగించి శాస్త్రవేత్తలు రాకెట్లను తయారు చేస్తున్నారు. కాని ముందుగా దేవాలయంలో పూజలు చేసిన అనంతరం దీన్ని ప్రయోగిస్తున్నారు. ప్రయోగం సక్సెస్ అయితే వీరి ఖాతాలో వేసుకుంటున్నారు. ఫెయిల్ అయితే దేవుడి ఖాతాలో వేసేస్తున్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత శాస్త్రీయ భావాలకు బదులు అశాస్త్రీయ భావాలను ఎక్కువగా విస్తరింప చేస్తున్నది. సాక్షాత్తు ప్రధానమంత్రి నేషనల్ సైన్స్ కాంగ్రెస్‌లో మాట్లాడుతూ కౌరవులు కుండలో పుట్టారని, అదే టెస్ట్ ట్యూబ్ బేబీ అని చెప్పారు. విమానాన్ని రైట్ సోదరులు కనిపెట్టక ముందే పుష్పక విమానం ఉండేదని అందులో ఎంతమంది ఎక్కినా ఇంకొకరికి చోటు ఉంటుందని అన్నారు. ఉంటే ఆ విమానం ఏమైనట్టు? ఎక్కడికి ఎగిరిపోయినట్టు? శివుడు వినాయకునికి ఏనుగు తల పెట్టాడని, అదే ప్లాస్టిక్ సర్జరీ అని ప్రస్తావించారు. వాస్తవానికి మనిషికి జంతువు తలను పెట్టి సర్జరీ చేయడం సాధ్యమా? కరోనా పోవాలంటే ఆవు మూత్రాన్ని తాగాలని ఆర్ఎస్ఎస్ ప్రచారం చేసింది. ఇప్పుడు బిజెపి ఆవు మూత్రం, పేడలో ఆక్సిజన్ ఉంటుందని పరిశోధనలు చేయమంటున్నది. జ్యోతిష్యాన్ని, వాస్తు శాస్త్రాలను యూనివర్సిటీలో బోధించాలంటోంది. ఇది మూఢనమ్మకాలను నిర్మూలించడం కాకుండా మరింతగా వాటి వైపు ప్రేరేపించేలా చేస్తున్నది. ప్రపంచం మొత్తం సైన్స్‌ను నమ్ముకుని పరిశోధన చేస్తుంటే...భారతదేశం మాత్రం వేదాలు, ఆవు పేడ, జ్యోతిష్యం, వాస్తు వంటి మూఢనమ్మకాలపై పరిశోధనలు చేసి ఏం సాధించాలనుకుంటున్నది? బిజెపి నేరుగా అశాస్త్రీయ భావాలను ప్రజల మెదళ్లలో ఎందుకు నింపాలనుకుంటున్నది? అనే విషయానికి వస్తే సైన్స్ ప్రజలను విజ్ఞానవంతులను చేస్తుంది. మత విశ్వాసాలకు, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా మరో కోపర్నికస్ గాని, బ్రూనో గాని తయారవుతారు. అటువంటి వారు మతం నుండి పుట్టిన విశ్వాసాలను ప్రశ్నిస్తారు. భావాజాల ప్రచారంలో మతోన్మాదం, మత భావాలు సైన్స్‌కు పూర్తి వ్యతిరేకంగా ఉంటాయి. కావున ఈ రెండింటి మధ్య నిరంతరం ఘర్షణ జరుగుతూ ఉంటుంది. నేడు శాస్త్రీయ దృక్పథాన్ని ప్రజల్లో విస్తరింపచేసేందుకుగాను విద్యార్థులు, యువత, మేధావులు జన విజ్ఞాన వేదిక వంటి సంస్థలతో కలిసి పనిచేయాల్సిన అవసరం ఎంతైనా వుంది.

- డి.రాము,
ఎస్.ఎఫ్.ఐ విజయనగరం జిల్లా అధ్యక్షులు,
సెల్ : 9705545164

పాట

మోటూరు ఏడీ...?

(మువ్వలన్నీ ఘొల్లుమన్నాయి...ఏడయ్యా
మా అయ్య మోటూరు ఏడని? ఘొల్లుమన్నాయి...
ఘొల్లుమన్నాయి...)

నెమలి తల్లి ఆడనంది కోయిలమ్మ కూయనంది..
చుక్కాలేమో చిన్నబోయి ఎక్కి ఎక్కి ఏడ్చాయి...
భూమి తల్లి రోదించింది ఆకాశమంత శోకించింది..
అక్షరాల అమృతమూర్తి మోటూరు ఏడని.. మోటూరు ఏడని...
(మువ్వలన్నీ)

•

కలమే తన ఆయుధంగా ఉద్యమాలు నడిపిన తండ్రి..
శ్రమజీవుల కాశాజ్యోతి అలుపెరుగని కన్నతండ్రి..
దోపిడీ గడీలను అక్షరాల తూటా పేల్చి...
కార్మిక శ్రామిక ఉద్యమాలకు బాసట నిలిచే మోటూరు...
(మువ్వలన్నీ)

•

మహిళా ఉద్యమాలకు బాసట నిలిచిన యోధుడివయ్యా..
శ్రమ దోపిడీ చేసేటోళ్లను తన కంఠంతో గర్జించెను..
ఉద్యమాలే ఊపిరి అంటూ ఎందరికో బోధించావు..
తరతరాల చరిత్రను అందించిన రూపశిల్పివి నీవు...
(మువ్వలన్నీ)

•

సిద్ధాంతం పోరాటం సామాజిక న్యాయం కొరకు...
అనునిత్యం శ్రమించినావు కుల వ్యవస్థ వద్దన్నావు...
సామ్రాజ్యవాద విష సంస్కృతిని ఈ దేశానికే వద్దన్నావు...
బలము లేని వర్గం కొరకు అక్షరమై నిలిచావు...
(మువ్వలన్నీ)

•

కులం వర్గం కూలేవరకు ఆధిపత్యం అంతరించే వరకు..
మీరు చూపిన బాటలోనే మా అడుగులు ముందుకు వేస్తాం..
భౌతికంగా దూరమైనా మా గుండెల్లో ఉంటావయ్యా మోటూరు..
మీ అక్షరాల పూదోటల్లో పయనిస్తూ ఉంటామయ్యా..
అందుకో మా అందరి లాల్ సలాములయ్యా మోటూరు.
(మువ్వలన్నీ)

- పి. అప్పన్న,
ఎన్టీఆర్ జిల్లా ప్రజానాట్య మండలి కార్యదర్శి.


గాజా సిటీలో శిథిలమైన భవనాలు

విస్తరించిన దాడులు !

- శిథిలాల్లోనే పాలస్తీనియన్ల జీవనం
- అంతర్జాతీయ కార్యాచరణకు హమాస్ పిలుపు

గాజా : ప్రపంచ వ్యతిరేకతను బేఖాతరు చేస్తూ ఇజ్రాయిల్ గాజాలో దాడులను మరింత తీవ్రతరం చేసింది. గాజాలోని సెంట్రల్ డేర్ అల్ బాలాహ్‌పై తాజాగా ఇజ్రాయిల్ దళాలు విరుచుకుపడ్డాయి. సహాయక శిబిరాల్లో తలదాచుకుంటున్న వారిని కూడా తరిమేసి, ఆ ప్రాంతంపై అధునాతన అమెరికన్ బాంబులను కురిపిస్తోంది. పాలస్తీనియన్లు శిథిలాల మధ్యే జీవిస్తున్నారని ఐక్యరాజ్య సమితి పాలస్తీనా శరణార్థి సంస్థ (యుఎన్ఆర్‌డబ్ల్యుఎ) ప్రతినిధి లూయిస్ వాటరిడ్జ్ వ్యాఖ్యానించారు. అడ్డూ అదుపు లేకుండా దాడులు కొనసాగుతూనే వున్నాయని అన్నారు. ప్రాంతీయ ఉద్రిక్తతలు పెచ్చరిల్లుతున్న తరుణంలో మధ్యప్రాచ్యానికి పలు ఎయిర్‌లైన్స్ సంస్థలు విమాన సర్వీసులను రద్దు చేశాయి. సహాయక కార్యకలాపాలు చేపట్టే కార్యకర్తలను కూడా ఇజ్రాయిల్ వదలడం లేదు. నెతన్యాహు ప్రభుత్వ యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ కార్యాచరణకు హమాస్ పిలుపునిచ్చింది. గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడులను, ఊచకోతలను నేరపూరితమైన చర్యలుగా, మానవ హక్కుల ఉల్లంఘనలుగా పరిగణించాలని అంతర్జాతీయ సమాజాన్ని కోరింది. ఆధునిక చరిత్రలోనే అత్యంత హేయమైన ఊచకోతను గాజా ప్రజలు గత పది మాసాలుగా అనుభవిస్తున్నారని హమాస్ పేర్కొంది.

గాజాలో కాల్పుల విరమణ ఒప్పందానికి ఇదే చివరి అవకాశం : బ్లింకెన్

టెల్ అవీవ్ : గాజాలో కాల్పుల విరమణ ఒప్పందానికి ఇదే చివరి అవకాశమని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ సోమవారం వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందం కోసమే బ్లింకెన్ ఆదివారం టెల్‌అవీవ్ చేరుకున్నారు. గాజా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇక ఖరారు చేయాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. ఈ ఒప్పందం పూర్తయి, హమాస్ చేతిలో ఉన్న బందీలను ఇజ్రాయిల్‌కు అప్పగిస్తే, గాజాలో గత 10 నెలలుగా సాగుతున్న ఊచకోతలు, దాడులు నుండి పాలస్తీనియన్లకు ఉపశమనం కలుగుతుందన్నారు. "ఇది నిర్ణయాత్మకమైన క్షణం. బందీలను ఇంటికి చేర్చడానికి, కాల్పుల విరమణకు, శాంతి భద్రతలు కల్పించడానికి, ప్రతి ఒక్కరినీ మెరుగైన స్థితిలో వుంచేందుకు ఇదే ఉత్తమమైనది. చివరిది కావచ్చు" అని ఇజ్రాయిల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్‌తో చర్చల అనంతరం బ్లింకెన్ వ్యాఖ్యానించారు. ఈ ప్రక్రియను నిర్వీర్యం చేసేందుకు ఎవరూ ఎలాంటి చర్యలు తీసుకోకుండా చూడాల్సిన సమయం కూడా ఇదేనని అన్నారు. గాజాలో దాడులు ప్రారంభమైనప్పటి నుండి బ్లింకెన్ మధ్యప్రాచ్యంలో పర్యటించడం ఇది తొమ్మిదవసారి. కాల్పుల విరమణ ఒప్పందంపై చర్చలు జరిపేందుకు మధ్యవర్తిత్వం నెరపుతున్న దేశాల ప్రతినిధులు ఈ వారంలో కైరోలో మళ్లీ సమావేశం కానున్నారు. ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ, రక్షణ మంత్రులతో చర్చల అనంతరం బ్లింకెన్ మంగళవారం ఈజిప్ట్ వెళ్లనున్నారు.

శాంతియుత పరిష్కారానికి సాయపడతాం

- ఉక్రెయిన్‌లో పర్యటనకు ముందు కేంద్రం ప్రతిపాదన

న్యూఢిల్లీ : ఉక్రెయిన్‌లో ఘర్షణలకు శాంతియుత పరిష్కారాన్ని కనుగొనడానికి సహాయపడేందుకు సిద్ధంగా వున్నట్లు భారత్ సోమవారం తెలిపింది. ఉక్రెయిన్‌లో ప్రధాని మోడీ పర్యటించడానికి కొద్ది రోజులు ముందుగా భారత ప్రభుత్వం ఈ ప్రతిపాదన చేసింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో చర్చలు జరిపేందుకు ఈ నెల 23న మోడీ కీవ్ (ఉక్రెయిన్ రాజధాని)కు వెళ్లనున్నారు. భారత్ ఎప్పుడూ దౌత్యాన్ని, చర్చల ప్రక్రియనే ప్రోత్సహిస్తుందని విదేశాంగ శాఖ కార్యదర్శి (పశ్చిమ) తన్మయ లాల్ మీడియా సమావేశంలో చెప్పారు. అధ్యక్షుడు జెలెన్‌స్కీతో భేటీలో దీనిపై కూడా చర్చ ఉంటుందని తెలిపారు. అటు రష్యా ఇటు ఉక్రెయిన్ రెండు దేశాలతో భారత్ సంబంధాలు కొనసాగిస్తోంది.

ట్రిపుల్ తలాక్ నేరమే !

- సుప్రీంలో సమర్థించుకున్న కేంద్రం

న్యూఢిల్లీ : మూడుసార్లు తలాక్ చెప్పడాన్ని నేరంగా పరిగణిస్తూ చట్టం తీసుకురావడాన్ని సుప్రీం కోర్టులో కేంద్రప్రభుత్వం సమర్థించుకుంది. ముస్లిం భర్తలు తమ భార్యలను అన్యాయంగా వదిలివేయడాన్ని ఈ పద్ధతి చట్టబద్ధం చేస్తోందని, వ్యవస్థాగతం చేస్తోందని, ఇదేమీ ఇస్లామిక్ కాదు, చట్టబద్ధమైనది కాదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు 433 పేజీల కౌంటర్ అఫిడవిట్‌ను కేంద్రం కోర్టులో దాఖలు చేసింది. ట్రిపుల్ తలాక్ ఏకపక్షంగా వుంటుందని షాయారా బానో కేసులో 2017లో సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా గుర్తు చేసింది. ఎలాంటి చట్టబద్ధత లేదా మత బద్ధత లేని ఈ పద్ధతి వివాహితులైన ముస్లిం మహిళల పట్ల వివక్ష చూపుతోందని, ఇది నేరమని 2019లో తీసుకువచ్చిన చట్టం పేర్కొంటోంది. వివాహమనేది సామాజిక వ్యవస్థ అని, దీన్ని పరిరక్షించడంలో ప్రభుత్వానికి ప్రత్యేక ప్రయోజనం వుంటుందని కేంద్రం పేర్కొంది. క్రిమినల్ చట్టానికి సంబంధించిన ఇతర సాధనాలు అంటే ఉదాహరణకు గృహ హింస చట్టం, వరకట్న నిషేధ చట్టం వంటి వాటిని ఉపయోగించి వివాహాల సుస్థిరతను ప్రభుత్వం కాపాడవచ్చని కేంద్రం వాదించింది. ట్రిపుల్ తలాక్ విధానం చెల్లుబాటు కాదని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేయనందున దానిని నేరంగా పరిగణించాల్సిన అవసరం లేదన్న పిటిషన్‌పై కేంద్రం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసింది.

గాజాలో మారణహోమాన్ని, దాడులను ఖండిస్తూ
చికాగోలో నిరసనల హోరు

చికాగో : డెమొక్రటిక్ పార్టీ నాలుగు రోజుల జాతీయ సదస్సుకు నిరసనల సెగ తగిలింది. నవంబరు5న జరిగే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ తరపున పోటీ చేసేందుకు కమలా హారిస్‌కు అధికారికంగా టికెట్ ప్రకటించడం కోసం సోమవారం నుండి నాలుగు రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు వారం రోజుల ముందు నుంచే వివిధ సంస్థలు నిరసనలకు సన్నాహాలు చేశాయి. ఈ రెండు మూడు రోజుల్లో ఏడెనిమిది భారీ నిరసన ర్యాలీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. చికాగోలోని యునైటెడ్ సెంటర్‌కు వెలుపల సోమవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. గాజాలో మారణ హోమాన్ని సృష్టిస్తున్న ఇజ్రాయిల్‌కు డబ్బు, ఆయుధాలు అందిస్తున్న బైడెన్ ప్రభుత్వ వైఖరిని వారు తీవ్రంగా వ్యతిరేకించారు. తక్షణమే కాల్పుల విరమణ ప్రకటించాలని నినదించారు. గత నెలలో రిపబ్లికన్ పార్టీ జాతీయ సదస్సుకు కూడా నిరసనల సెగ తగిలింది. గాజాపై ఇజ్రాయిల్‌కు సాయం చేయడం మానుకోవాలని, మొత్తంగా ఇజ్రాయిల్ పట్ల విధానాల్లో మార్పు రావాలని వారు నినదించారు. దాదాపు 20వేల మంది ఈ ప్రదర్శనలో పాల్గొన్నారని అంచనా.

దీనికి ఒక రోజు ముందుగా అంటే ఆదివారం నాడు చికాగోలో వందలాదిమంది ఆందోళనకారులు ప్రదర్శన నిర్వహించారు. ఆర్థిక అన్యాయం, పునరుత్పత్తి హక్కులు వంటి అమెరికాలోని అన్యాయమైన చట్టాలకు వ్యతిరేకంగా ప్రారంభమైన ఈ అందోళన క్రమంగా గాజాలో దాడులను నిరసిస్తూ, పాలస్తీనా అనుకూల నిరసనగా మారిపోయింది. ఆ వెంటనే చికాగోలోని మిచిగాన్ అవెన్యూ వరకు ప్రదర్శన చేపట్టారు. చికాగో ఏరియాలో పెద్ద సంఖ్యలో పాలస్తీనియన్లు వుంటారు. పాలస్తీనా పతాకాలు చేబూని ఆందోళనకారులు ప్రదర్శనలో పాల్గొన్నారు. తొలుత 200మందితో ప్రారంభమైన ప్రదర్శన కొద్ది సేపటికే ప్రభంజనంలా మారిపోయింది. గుంపులు గుంపులుగా జనం తరలి వచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. ప్రదర్శకులను అదుపు చేసేందుకు పోలీసు బలగాలను పెద్దయెత్తున మోహరించారు. దాదాపు 13మంది వక్తలు ర్యాలీనుద్దేశించి ప్రసంగించారు.

డెమొక్రాటిక్ పార్టీ జాతీయ సదస్సు ప్రారంభం

డెమొక్రాటిక్ పార్టీ నాలుగు రోజుల జాతీయ సదస్సు అధ్యక్షుడు బైడెన్ ప్రసంగంతో ప్రారంభమైంది. మిగతా మూడు రోజులు కమలా హారిస్ పట్టాభిషేకానికి కేటాయించారు. మాజీ ప్రాసిక్యూటర్ కమలా హారిస్‌కు ఉపాధ్యక్షురాలిగా పనిచేసే అనుభవం ఉంది. యుద్ధ విస్తరణ, కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేయడంలో రిపబ్లికన్లకు, డెమొక్రాట్లకు పెద్ద తేడా ఏమీ లేదు. కాకుంటే డెమొక్రాట్లు వాటిని పాపులిస్టిక్ పద్ధతిలో ప్రచారం చేసుకుంటారు. డెమొక్రాటిక్ పార్టీ జాతీయ సదస్సు వాస్తవాలను కప్పిపుచ్చి ప్రజలను మభ్యపుచ్చేందుకు అన్ని రకాల టక్కు టమార విద్యలను ప్రదర్శిస్తుందని సోషలిస్టు ఈక్వాలిటీ పార్టీ అధ్యక్ష అభ్యర్థి జోసెఫ్ కిషోర్ వ్యాఖ్యానించారు.

12 హామీలతో ఎన్‌సి మేనిఫెస్టో విడుదల

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు నేపథ్యంలో నేషనల్ కాన్ఫరెన్స్ సోమవారం తన మేనిఫెస్టో విడుదల చేసింది. ఆర్టికల్ 370 పునరుద్ధరణ, జమ్ముకాశ్మీర్‌కు రాష్ట్ర హోదా, 2000లో అప్పటి అసెంబ్లీ ఆమోదించిన స్వయం ప్రతిపత్తి తీర్మానాన్ని అమలు చేయడం.. వంటి 12 హామీలను మేనిఫెస్టోలో పొందుపర్చింది. పార్టీ కార్యాలయంలో ఇతర నాయకులతో కలిసి పార్టీ ఉపాధ్యక్షులు ఒమర్ అబ్దుల్లా మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పార్టీ నెరవేర్చగల హామీలను మాత్రమే ఇస్తుందని అన్నారు. జమ్ముకాశ్మీర్‌లో సెప్టెంబరు 18, సెప్టెంబరు 25, అక్టోబర్ 1న మూడు దశల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అక్టోబర్ 4న ఫలితాలు ప్రకటించనున్నారు.

ఉగ్రవాదుల కాల్పుల్లో సిఆర్‌పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ మృతి

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లోని ఉదంపూర్‌లో సోమవారం పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న పారామిలటరీ బలగాలపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో సిఆర్‌పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ మరణించారు. ఉదంపూర్‌లోని డూడు ప్రాంతంలో జమ్ము కాశ్మీర్ పోలీసులకు చెందిన సిఆర్‌పిఎఫ్, ప్రత్యేక ఆపరేషన్ గ్రూప్ (ఎస్ఒజి) పెట్రోలింగ్ జరుపుతుండగా, ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దీంతో, 187వ బెటాలియన్‌లోని జి కంపెనీకి చెందిన సిఆర్‌పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ కులదీప్‌కు బుల్లెట్ గాయాలు కావడంతో, ఆసుపత్రికి తరలిస్తుండగా మరణించినట్లు పేర్కొన్నారు.

నిందితుడికి నేడు లై డిటెక్టర్ పరీక్ష?

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నించారు. శుక్ర, శనివారాల్లో అర్ధరాత్రి వరకు అనేక గంటల పాటు విచారణ సాగింది.

సిబిఐ ప్రశ్నలివే

ఈ హత్యను ఆత్మహత్య అని డిక్లేర్ చేయడానికి ఎందుకు అంత తొందరపడ్డారు?, మీరు కూడా డాక్టరే కదా, సంఘటనా స్థలంలో సాక్ష్యాధారాలు సురక్షితంగా వుంచాలని మీకు తెలియదా? నేరమని తెలిసి కూడా అవన్నీ తారుమారు కావడానికి ఎలా అనుమతించారు? ఎవరి సలహా మీద కుటుంబానికి సమాచారం అందించారు, అందులో వాస్తవాలను ఎందుకు దాచిపెట్టారు?, కుటుంబానికి సమాచారం అందించేందుకు అంత ఆలస్యం ఎందుకైంది? కుమార్తె మృతదేహాన్ని చూపించడానికి ఎందుకు అంత ఆలస్యం జరిగింది ? ఆస్పత్రిలో భద్రతా ఏర్పాట్లు ఏమున్నాయి? సంఘటన జరిగిన వెంటనే మీరెందుకు రాజీనామా చేశారు? దానికి గల కారణాలేంటి? అంటూ పలు ప్రశ్నలను సిబిఐ అధికారులు వేశారు. సందీప్‌ఘోష్ వీటికి ఇంకా సంతృప్తికరమైన సమాధానాలు ఇవ్వాల్సి వుందని అధికారులు పేర్కొంటున్నారు. ఇదిలావుండగా బాధితురాలికి న్యాయం చేయాలని కోరుతూ రోజు రోజుకీ ఆందోళనలు ఉధృతమవుతున్నాయి.

సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టినందుకు అరెస్టు

జూనియర్ డాక్టర్ హత్యాచారంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించినా, విమర్శించినా వెంటనే వారిని పోలీసులు అరెస్టు చేయడమో, బెదిరించడమో చేస్తున్నారు. ఈ ధోరణి రానురాను వికృత రూపం దాల్చుతోంది. సోమవారం డాక్టర్ గుర్తింపు వివరాలను సోషల్ మీడియాలో వెల్లడించినందుకు బికాం సెకండ్ ఇయర్ చదువుతున్న విద్యార్థి కీర్తి శర్మను కొల్‌కతాలో అరెస్టు చేశారు. ముఖ్యమంత్రి మమతను బెదిరించారని అతనిపై అభియోగం మోపారు., బాధితురాలి ఫోటోను వివరాలను కూడా వెల్లడించాడని పోలీసులు చెప్పారు.

గవర్నర్ అత్యవసర సమావేశం

కోల్‌కతా ఘటనపై పెరుగుతున్న ఆందోళనల పట్ల బెంగాల్ గవర్నరు సివి ఆనంద్ బోస్ మొసలి కన్నీరు కార్చారు. బిజెపి గేమ్ ప్లాన్‌ను అమలు చేసేందుకు తనదైన శైలిలో యత్నిస్తున్నారు. సోమవారం రాష్ట్రంలో కొందరు ఎంపిక చేసిన వారితో గవర్నరు అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

సోషల్ మీడియాలో పోస్టులు షేర్ చేసినందుకు సీనియర్ డాక్టర్లు కునాల్ సర్కార్, సువర్ణ గోస్వామి తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని కోరడం నేరమేమీ కాదని డాక్టర్ సర్కార్ వ్యాఖ్యానించారు.

విశ్వసనీయత కోల్పోయిన మమత : బృందాకరత్ విమర్శ

జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం కేసులో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విశ్వసనీయత కోల్పోయారని సిపిఎం నేత బృందా కరత్ విమర్శించారు. 'తనను తాను కాపాడుకోవాలని, ఈ కేసులో నిందితుల పాత్రను కప్పిపుచ్చేందుకు ఆమె యత్నిస్తున్నారు. తృణమూల్ ఎంపీల ప్రకటనలను మీరు చూసినట్లైతే, తామే డాక్టర్లమైనట్లు వారు తప్పుడు ప్రకటనలు ఇస్తున్నారు. కేసు గురించి వాస్తవంగా ఏమీ మాట్లాడడం లేదు. టిఎంసి ఎంపి సుఖేందు శేఖర్ రాయ్‌ను కోల్‌కతా పోలీసులు పిలవడంపై బృందాకరత్ వ్యాఖ్యానించారు.

కలకత్తా హైకోర్టు న్యాయవాదుల నిరసన ప్రదర్శన

బాధితురాలికి న్యాయం చేయాలని కోరుతూ కలకత్తా హైకోర్టు న్యాయ వాదులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని, కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కేసులోని అన్ని కోణాలను సిబిఐ విచారించాలని న్యాయవాది నరేంద్ర కోరారు.

శరీరంపై తీవ్ర గాయాలు
కోల్‌కతా వైద్యురాలి పోస్ట్‌మార్టం నివేదిక

కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్యకు సంబంధించిన పైశాచిక ఘటనలో బాధితురాలి పోస్ట్‌మార్టం నివేదిక దిగ్భ్రాంతి కలిగించే వాస్తవాలను బయట పెట్టింది. 'ఇండియా టుడే' పత్రికకు లభించిన అటాప్సీ నివేదిక ప్రకారం వైద్యురాలిపై లైంగిక దాడి జరిగిందని, ఆమె శరీరంపై తీవ్ర గాయాలు ఉన్నాయని రూఢి అయింది. మృతురాలి తల, ముఖం, మెడ, చేతులు, జననేంద్రియంపై 14 గాయాలు ఉన్నాయని పోస్ట్‌మార్టం నివేదిక తెలిపింది. 'బాధితురాలి గొంతు నొక్కడంతో ఆమె ఉక్కిరిబిక్కిరయింది. ఈ కారణంగానే మరణించింది. దీనిని హత్యగానే పరిగణించాలి. ఆమెను బలత్కారం చేయడాన్ని బట్టి చూస్తే లైంగిక దాడి జరిగిందనే భావించాలి. జూనియర్ వైద్యురాలి జననేంద్రియంపై తెల్లని, చిక్కటి, జిగట ద్రవం కన్పించింది. బాధితురాలి ఊపిరితిత్తులలో రక్తం గడ్డకట్టింది. రక్తస్రావం జరిగింది. శరీరంలో ఫ్రాక్చర్స్ ఏమీ లేవు. రక్త నమూనాలను, శరీరంలోని ఇతర ద్రవాలను మరిన్ని విశ్లేషణల కోసం పంపారు' అని పోస్ట్‌మార్టం నివేదిక వివరించింది. కోల్‌కతా ఘటనను సుమోటోగా తీసుకున్న సుప్రీంకోర్టు మంగళవారం విచారణ చేపట్టనుంది.

మెడికోల రక్షణకు చట్టాన్ని పటిష్టపరచాలి: ప్రధానికి పలువురు నిపుణులు లేఖ

ఇదిలా ఉండగా డెబ్బయి మంది పద్మ అవార్డు గ్రహీతలు ప్రధాని మోడీ వ్యక్తిగతంగా జోక్యం చేసుకుని న్యాయం చేయాలంటూ సోమవారం ఒక లేఖ రాశారు.ఇటువంటి దుర్మార్గమైన చర్యలు ఆరోగ్య సంరక్షణ, వైద్య నిపుణుల సేవ పునాదులను పెకలించివేస్తాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. . హింసను.. ముఖ్యంగా మహిళలు, బాలికలు, హింసను పరిష్కరించాల్సిన తక్షణ అవసరాన్ని వారు ఆ లేఖలో పేర్కొన్నారు. పద్మ అవార్డు గ్రహీత డాక్టర్లలో రేడియాలజిస్ట్ డాక్టర్ హర్ష్ మహజన్, ఎయిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రణదీప్ గులేరియా, ఐసిఎంఆర్ మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ బలరామ్ భార్గవ, న్యూరాలజిస్ట్ డాక్టర్ ఎం.వి పద్మ శ్రీవాస్తవతో పాటు పలువురు ఉన్నారు. ఆరోగ్య సంరక్షణ నిపుణులను రక్షించటానికి ప్రస్తుత చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌లను కఠినంగా వర్తింపజేయటం, లైంగిక హింసకు పాల్పడేవారికి కఠినమైన, కాలపరిమితితో కూడిన శిక్షలు, ఆస్పత్రులు, వైద్య సంస్థలలో మెరుగైన భద్రతా చర్యలు వంటి చర్యలు చేపట్టాలని వారు సూచించారు. వైద్యులు, వైద్య నిపుణులు, వైద్య సంస్థలపై హింసా నిరోధక బిల్లు, ఆరోగ్య సంరక్షణ కార్మికుల రక్షణ కోసం ఒక ప్రత్యేక చట్టాన్ని త్వరగా రూపొందించి, అమలు చేయాలని వారు ఆ లేఖలో డిమాండ్ చేశారు.

అనాథాశ్రమంలో ఘోరం

(మొదటిపేజీ తరువాయి)

అరుణ్‌కుమార్‌పై కేసులు నమోదు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. విద్యాశాఖతో పాటు, ఇతర శాఖల అనుమతులు లేకుండి నిర్వహిస్తున్న ట్రస్ట్‌పై చర్యలు తీసుకుంటామని చెప్పారు. అస్వస్థతకు గురైన వారిలో 14 మంది విశాఖ కెజిహెచ్‌లో, 18 మంది అనకాపల్లి జిల్లా నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిల, ఎనిమిది మంది అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో కొంతమంది పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది.

రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా : ముఖ్యమంత్రి

ఈ ఘటనపై ఉన్నత స్థాయి విచారణకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. మృతి చెందిన విద్యార్థుల కుటుంబ సభ్యులకు, సంరక్షకులకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌తో ఫోన్‌లో మాట్లాడి ఘటన వివరాలు, విద్యార్దులకు అందిస్తున్న వైద్య సహాయం గురించి అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే : జగన్

ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని, సరైన పర్యవేక్షణ కొరవడిందనడానికి ఈ ఘటనే ఉదాహరణగా నిలుస్తుందని వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని హితవు పలికారు.

రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని, కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలి : సిపిఎం

మరణించి విద్యార్థుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని, వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ కమిటీ డిమాండ్ చేసింది. ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సోమవారం ప్రకటన విడుదల చేశారు. మరణించిన విద్యార్థులకు సంతాపం ప్రకటించారు. వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. తీవ్ర అస్వస్థతకు గురైై చికిత్స తీసుకుంటున్న వారికి మెరుగైన వైద్య సదుపాయం అందించాలని కోరారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేయాలని, అస్వస్థతకు గురైన వారికి మెరుగైన వైద్యం అందించాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

రూ.25 లక్షలు చొప్పన పరిహారం ఇవ్వాలి : ఆదివాసీ గిరిజన సంఘం

కలుషిత ఆహారం వల్ల మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున నష్టపరిహారం అందించాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, రాష్ట్ర నాయకులు పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. అస్వస్థతకు గురైన వారికి మెరుగైన చికిత్స అందించాలని కోరారు.

కారకులపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ఘటనపై ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ విచారం వ్యక్తం చేసింది. దీనికి కారకులపై చర్యలు తీసుకోవాలని, మరణించిన విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె ప్రసన్నకుమార్, ఎ అశోక్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జరిగిన విషయాన్ని యాజమాన్యం దాచిపెట్టడం వల్లే విద్యార్థులు మరణించారని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.కోటి చొప్పున పరిహారం అందించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నర్సీపట్నంలో ఆందోళన చేపట్టారు.

బాధితులకు హోం మంత్రి పరామర్శ

తీవ్ర అస్వస్థతకు గురైై విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న 14 మంది చిన్నారులను సోమవారం సాయంత్రం విశాఖపట్నం ఎంపి ఎం.శ్రీభరత్‌తో కలిసి హోం మంత్రి అనిత పరామర్శించారు. సంఘటనపై విచారణ జరుగుతోందన్నారు.. ఇటువంటి హాస్టళ్లు రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ ఉన్నా తక్షణం మూసివేయాలని ఆదేశించారు.

అయ్యన్న దిగ్భ్రాంతి

ఈ ఘటనపై అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థుల పరిస్థితిని ఏరియా హాస్పిటల్ పర్యవేక్షకులు డాక్టర్ నీలవేణిదేవిని అడిగి తెలుసు కున్నారు. పరిస్థితి విషమంగా ఉంటే వెంటనే విశాఖకు తరలించాలని ఆదేశించారు.

సీతారాం ఏచూరికి స్వల్ప అస్వస్థత

- ఎయిమ్స్‌లో చేరిక

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఎయిమ్స్‌లో చేరారు. సోమవారం నాడు ఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఇంటికి వెళ్తూ మార్గం మధ్యలో ఎయిమ్స్‌లో సాధారణ చెకప్ కోసం వెళ్లగా, వైద్యులు ఆయనను అడ్మిట్ అవ్వాలని సూచించారు. వారి సూచన మేరకు సీతారాం ఏచూరి ఎయిమ్స్‌లో చేరారు. ఆయన ఆరోగ్యం బాగానే ఉందని వైద్యులు తెలిపారు.

యుపి ఆసుపత్రిలో ఘోరం

- దళిత నర్సుపై డాక్టర్ అత్యాచారం

లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో దారుణం జరిగింది. ఒక దళిత నర్సును నిర్బంధించి డాక్టర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. మరో ఇద్దరు ఈ దారుణానికి సహకరించారు. ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనపై బాధితురాలి తండ్రి సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు మొరాదాబాద్ పోలీసు సూపరింటెండెంట్ (రూరల్) సందీప్ కుమార్ మీనా సోమవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం బాధితురాలు గత ఏడునెలల నుంచి ఈ ప్రైవేటు ఆసుపత్రిలో పని చేస్తోంది. ఆదివారం రాత్రి కూడా విధులకు వెళ్లింది. అర్ధరాత్రి సమయంలో మరో నర్సు మెహనాజ్ డాక్టర్ షానవాజ్‌ను ఆయన గదిలో కలవాలని కోరింది. బాధితురాలు అందుకు నిరాకరించడంతో మెహనాజ్, వార్డ్ బాయ్ జునైద్ ఆమెను బలవంతంగా ఆసుపత్రిపై అంతస్తులోని గదికి తీసుకెళ్లి బయట నుంచి తాళం వేశారు. తరువాత డాక్టర్ షానవాజ్ గదిలోకి వచ్చి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. చంపేస్తానని బెదిరింపులకు, కుల దూషణలకు కూడా పాల్పడ్డాడు. ముగ్గురు నిందితుల్ని పోలీసులు అరెస్టు చేశారు. చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కులదీప్‌సింగ్ మార్గదర్శకాల మేరకు ఆసుపత్రిని సీజ్ చేశారు.

కోపం వస్తుంది!



'రవీ నీ కారియర్‌లో అరటికాయ వేపుడు, సాంబారన్నం, పెరుగన్నం పెట్టాను. పారేయ కుండా శుభ్రంగా తిను' చెప్పింది తల్లి రమ.

'అలాగేనమ్మా' అంటూ రవి స్కూల్ బ్యాగ్ తీసుకుని ఆటోలో స్కూల్‌కి వెళ్ళిపోయాడు. స్కూల్లో లంచ్ బెల్‌లో కారియర్లో పెట్టిన పదార్థాలలో సగమే తిని సగం ఇంటికి తెచ్చాడు. అది చూసిన తల్లి కోపంగా 'పూర్తిగా ఎందుకు తినలేదు? ఇలాచేస్తే నీకు బలం, బుద్ధి రెండూ ఉండవు' అన్నది.

'నాకు తిన బుద్ధి కాలేదమ్మా" అన్నాడు రవి.

'తినాలి. భోజనం వేస్ట్ చేయకూడదు' అన్నది రమ.

ఓ ఆదివారం ఇంట్లో అందరూ భోజనానికి కూర్చున్నారు. ఆరోజు కూడా రవి కంచం చుట్టూ ఆహార పదార్థాలు పారవేశాడు!

అది చూసి రవి నాన్న గోపాలం 'చూడు రవీ అన్నం ఇలా పారేస్తే చాలా మందికి కోపం వస్తుంది తెలుసుకో' అన్నాడు.

'అదేమిటి నాన్నా నేను అన్నం పారేస్తే అమ్మకు, నీకు కోపం వస్తుంది అంతే కదా! మరి మిగతావారెవరు? వారికి కోపం ఎందుకు వస్తుంది' అని ఆశ్చర్యపోతూ అడిగాడు.

'చెబుతా విను. ఎంతో కష్టపడి రైతు పంటను పండించి మన ఆరోగ్యం కోసం మంచికూరలు, ధాన్యాలు ఇస్తాడు. నీవు ఇలా పారేస్తే రైతుకు కోపం వస్తుంది. నీకోసం ఎంతో కష్టపడి రుచిగా వంట చేసే అమ్మ ఎదురుగానే వండిన పదార్థాలు పారేస్తే మీ అమ్మకు కోపం వస్తుంది. మనందరి కోసం నేను పొద్దున్నే ఆఫీసుకు, క్యాంపులకు వెళ్ళి కష్టపడి నెలకు జీతం అందుకుని ఆ డబ్బుతో బియ్యం, పప్పులు కొంటున్నాను కదా! మరి నా ఎదురుగానే ఇలా పారేస్తే నాకు కూడా కోపం వస్తుంది' వివరించాడు గోపాలం.

నాన్న మాటలతో కంచం చుట్టూ ఉన్న మెతుకుల్ని అలా కొంచెం సేపు చూస్తుండి పోయాడు రవి. రవిలో ఆలోచనలు మొదలయ్యాయి. తను చేసే ఈ వ్యర్థం వలన ఇంతమందికి కోపం వస్తోందా? నాన్న చెప్పింది నిజం. ఇక మీదట పారేయకూడదు అని ఆలోచించాడు.

'నాన్నా... ఈ రాత్రి భోజనం నుండి చూడు, నేను అన్నం అస్సలు పారేయను. అందరినీ సంతోషంగా ఉంచుతాను' అని నవ్వుతూ చెప్పాడు. రవి మాటలు విని గోపాలం, రమ ఎంతో సంతోషించి రవి తల నిమిరారు.

– కంచనపల్లి వేంకట కృష్ణారావు,
హైదరాబాద్,
93486 11445.

నేను గీసిన బొమ్మ






ఎస్‌డి. ఆయేషా,
6వ తరగతి, జెడ్‌పిహెచ్‌ఎస్
చిన్న గొట్టిముక్కల
మండలం, శివంపేట,
మెదక్.

దారి చూపండి


పిల్లలూ, చిట్టికి టెడ్డీబేర్‌తో ఆడుకోవాలని ఉందట. మరి తీసుకొచ్చి ఇవ్వరూ!



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

---

JEEVANA
జీవన
the family



బాలనటుడిగా స్టేజి ఆర్టిస్టు నుంచి బుల్లితెర.. ఆపైన వెండితెరపైకి ఎదిగారాయన. నటుడుగానే కాదు; రచయితగా, సాంకేతిక నిపుణుడిగా, నిర్మాత, దర్శకుడిగా.. ఇలా ఏ విభాగంలో పనిచేసినా దానికి వన్నెతెస్తున్నారు ఆయన. తండ్రి వద్ద ఓనమాలు నేర్చుకుని, ఆయనతోనే పోటీపడుతూ గెలుస్తూ.. ఓడుతూ సుమారు నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రంగస్థల ప్రయాణం చేసిన ప్రయాణికుడు. నాటకరంగంలోని ఐదు విభాగాల్లో బంగారు నందులను కైవసం చేసుకున్న అత్యుత్తమ నటుడు. ఆయనే గోపరాజు విజయ్‌కుమార్. రంగస్థలంలోనూ, సినిమారంగంలోనూ రాణిస్తున్నారు.

నాలుగు దశాబ్దాల నట విజయం



గుంటూరు జిల్లా తెనాలి మండలం కొలకలూరు గ్రామానికి చెందిన యజ్ఞేశ్వర వెంకట రమణమూర్తి, లీలా అన్నపూర్ణ విశాలక్ష్మి దంపతులకు గోపరాజు విజయ్ (జి.వి.హెచ్.ఎస్.వి.సి.కుమార్) 7, నవంబర్ 1977లో జన్మించారు. పాఠశాల నుంచి కళాశాల విద్య అంతా కొలకలూరులోనే సాగింది. ఆయనకు భార్య విజయలక్ష్మి, కుమార్తె వెంకట సాయిశ్రీ త్రిపుర, కుమారుడు కార్తికేయశర్మ ఉన్నారు.

రంగస్థల ప్రవేశం సాగిందిలా ...

1990 నుంచి 1996 వరకు 'శ్రీ సాయి ఆర్ట్స్' వారు ప్రదర్శించిన నాటకాల్లో తండ్రి గోపరాజు రమణ దర్శకత్వంలో నటుడిగా నటించారు. 1997 నుంచి 1998 వరకూ 'ఎల్‌విఆర్ క్రియేషన్స్-గుంటూరు' కీర్తిశేషులు నుసుకు కోటి శివ దర్శకత్వంలో నటునిగా రాణించారు. 1996 నుంచి 1998 వరకూ కాట్రగడ్డ రవితేజ, కె.వాసు, ఎంజి ప్రసాద్ వద్ద టివి రంగంలో సహాయ దర్శకుడిగా పనిచేశారు. 1999 నుంచి 2001 వరకూ 'రసరంజని' నిర్వహణలో కీర్తిశేషులు దుగ్గిరాల సోమేశ్వరరావు దర్శకత్వంలో 'నిజం', 'క్రాస్‌రోడ్స్' నాటకాల్లో నటుడిగా, 2002 నుంచి 2006 వరకూ కళాలయా, రంగ యాత్ర, సమాజాల దర్శకులైన కరణం సురేష్, నాయుడు గోపి వద్ద నటుడిగా, సహాయ దర్శకుడిగా అనేక నాటకాలకు నంది నాటకోత్సవాల్లో పాల్గొన్నారు.



'శ్రీసాయి ఆర్ట్స్' ఆధ్వర్యంలో...

2005 నుంచి 'శ్రీ సాయి ఆర్ట్స్' సంస్థ ద్వారా తండ్రి గోపరాజు రమణ అండతో, సీనియర్ కళాకారులైన చిట్టా శంకర్, సుబ్బారాయుడు, గోవర్ధనరెడ్డి, రాజా, పూర్ణాసత్యం,ప్రభు, కృష్ణమూర్తి, వరప్రసాద్, విజయ మోహన్, కీర్తిశేషులు టి.సాంబశివరావు, నాగబాబు, కన్నబాబు, గోవిందరాజులు, లీలా మోహన్, థామస్, శేషగిరి, నాగు, సత్తిబాబు, శ్రీధర్, మధు, వినయ్, శ్రీనివాస్,సాయితేజ, రత్నకుమారి, శ్రీజ, రమాదేవి, శ్రీలక్ష్మి, జ్యోతి, మాధవి, అమృతవర్షిని, లహరి, ఉమామహేశ్వరి తదితరుల సహకారంతో దర్శకుడిగా నాటక ప్రదర్శనలిచ్చారు. 2008లో ప్రముఖ సినీనటుడు జయప్రకాష్‌రెడ్డి నిర్వహణలో బిఎం రెడ్డి దర్శకత్వంలో 'కొత్తసైన్యం' నాటికలో నటించారు. 2009 నుంచి 2013 వరకూ 'విజయాదిత్య ఆర్ట్స్-నిజామాబాద్' సంస్థ దర్శకులు శ్రీపాద కుమార శర్మ వద్ద సహాయ దర్శకుడిగా పనిచేశారు. నటుడిగానూ, రచయితగానూ, కార్యదర్శిగా పనిచేస్తూ 'శ్రీ సాయి ఆర్ట్స్-కొలకలూరు' పేరుతో 2010లో నంద్యాలలో జరిగిన నంది నాటకోత్సవాల్లో 'నెంబరు లేని ఖైదీ' నాటికకు దర్శకుడిగా, 'మనసులు కలిస్తే' నాటకానికి నటునిగా, సహాయ దర్శకుడిగా పనిచేశారు. 2011లో గుంటూరులో జరిగిన నంది నాటకోత్సవాల్లో 'ఆరోజు కోసం' నాటకానికి రచయితగా, నటునిగా, సహాయ దర్శకుడిగా, 2012లో విజయనగరంలో జరిగిన నంది నాటకోత్సవాల్లో 'ఒక్క మాటే చాలు' నాటికకు దర్శకుడిగా, నటుడిగా బాధ్యతలు నిర్వహించారు.

ఈ 38 సంవత్సరాల్లో సుమారు 1500లకుపైగా నాటిక, నాటక ప్రదర్శనలు ఇచ్చారు. వ్యక్తిగతంగా అనేక విభాగాల్లో గెల్చుకున్న పరిషత్తు బహుమతులు 500లకుపైగానే ఉన్నాయి. పలు విభాగాల్లో గెల్చుకున్న నందులు 13. ఆయన దర్శకత్వంలో, రచనలో నంది నాటకోత్సవాల్లో గెల్చుకున్న నందులు 40కిపైగా ఉన్నాయి. బాల నటుడిగా 42, హాస్యనటుడిగా నంది-2002. ఉత్తమ విలన్‌గా 80, రేలంగి పురస్కారం-2007, సహాయ నటుడిగా 60, ఉత్తమ నటుడిగా నందితోపాటు 100, రచయితగా నంది బహుమతి తోపాటు అనేక పరిషత్తులలో 40, దర్శకుడిగా 200 అవార్డులు గెల్చుకున్నారు. ఆయన ఉన్నతికి కారకులైన రచయితల్లో అరిశెట్టి శివన్నారాయణ, పరాంకుశం వెంకట భవానీప్రసాద్, భారతుల రామకృష్ణ, ఆర్‌విఎస్ నాగేశ్వరరావు, గోవిందరాజులు నాగేశ్వరరావు, కన్నబాబు, వరప్రసాద్, కృష్ణమూర్తి, సాయితేజా, జయలక్ష్మి ఉన్నారు.

ప్రేరణ ఇలా ..

కీర్తిశేషులు గంధం నాగరాజు ద్వారా రచయితగా స్ఫూర్తిపొందారు విజయ్‌కుమార్. నటునిగా, దర్శకుడిగా గోపరాజు రమణ, దుగ్గిరాల సోమేశ్వరరావు, కరణం సురేష్, నాయుడు గోపి, వరి కోటి శివప్రసాద్, డాక్టర్ కోట్ల హనుమంతరావు, నుసుము కోటి శివ, ఎస్‌ఎం బాషాల ద్వారా ప్రేరణ పొందారు.

ప్రదర్శించిన సాంఘిక నాటకాలు : క్రాస్‌రోడ్స్, నిజం, ఎక్కడ ఉన్నా ఏమైనా, వలయం, ఆదిలక్ష్మి కళ్యాణం, కోరిక, ప్రసన్నకు ప్రేమతో, మనసులు కలిస్తే, ఆరోజు కోసం, సంధ్యాఛాయ,నాలుగు గోడల మధ్య, ఇంటింటి కథ.

సాంఘిక నాటికలు : ప్రొహిబిట్, సుఖీభవ, హుఆర్‌యు, నవ్వండి ఇది విషాదం, నీతిరేఖలు, గోడ కుర్చీ, పెన్‌స్ట్రోక్, ఇచ్చుటలో ఉన్న హాయి, ఎంతో చిన్న జీవితం, బంధుమిత్రుల అభినందనలతో, కొత్త సైన్యం, చల్‌చల్ గుర్రం, పుటుక్కు జరజర డుబుక్కుమే, నెంబరు లేని ఖైదీ, శ్రీకారం, ఒక్క మాటే చాలు, ఆరోజుకోసం, పెళ్లి చేసి చూడు, నాలుగు గోడల మధ్య, బైపాస్, చాలు ఇక చాలు, మధురం, కుక్కపిల్ల, తలుపులు తెరిచే ఉన్నాయి, మనసుతో ఆలోచిస్తే, గమ్యస్థానాల వైపు, ప్రేమతో నాన్న, కౌసల్యా సుప్రజా రామా....

టీవీ రంగంలో...

సహాయ దర్శకుడిగా 1996 నుంచి 1998 వరకూ అప్పటి ప్రసిద్ధ దర్శకులు ఎం జి ప్రసాద్, కాట్రగడ్డ రవితేజ, కె.వాసుల దగ్గర పనిచేశారు. 2003లో డాక్టర్ కోట్ల హనుమంతరావు దర్శకత్వంలో ఈటీవీ 2 లో ప్రసారమైన 'మాయాబజార్' ధారావాహికతో నటుడుగా బుల్లితెరపై ప్రవేశించారు. అనిల్ కుమార్, ఉదయ భాస్కర్, మలినేని రాధాకృష్ణ ప్రోత్సాహంతో 25 సీరియళ్లలో నటించారు. పుత్తడిబొమ్మ, స్వాతి చినుకులు, ముద్దమందారం మంచి గుర్తింపుతెచ్చిపెట్టాయి. 2007 నుంచి నాటక, నాటిక పోటీలకు న్యాయ నిర్ణేతగా నేటికీ కొనసాగుతున్నారు.

కళారంగమే ఊపిరి...

నా శ్వాస.. ధ్యాస అంతా కళారంగమే. రంగస్థల జీవితాన్ని ప్రసాదించిన ప్రముఖులు... నాటక పరిషత్‌ల నిర్వాహకులు, గుణ నిర్ణేతలు.. ఎందరో రచయితలు..మరెందరో దర్శకులు.. మరీ ముఖ్యంగా నాతోటి కళాకారులందరూ నా ఉన్నతికి కారకులు. తండ్రి గోపరాజు రమణ కుడి భుజంగానూ, మరొక భుజంగా ఉంటున్న సురభి ప్రభావతిలకు కృతజ్ఞతలు. భవిష్యత్తులో మరిన్ని మంచి క్యారెక్టర్లలో నటిస్తా. కొలకలూరు నాటక కళాపరిషత్ కార్యదర్శిగానూ, కళల కాణాచి తెనాలి సంస్థకు ప్రధాన కార్యదర్శిగా ఉన్నా.

– గోపరాజు విజయ్
రంగస్థల, టీవీ, రేడియో, సినీ నటులు
కొలకలూరు


సినిమారంగంలో...

2006లో శ్రీ సత్యనారాయణ మహత్యం మొదటి సినిమా. ఆ తర్వాత బెట్టింగ్ బంగార్రాజు, బాణం, ఓనమాలు, ఇష్క్, శ్రీదేవి సోడా సెంటర్, మిడిల్ క్లాస్ మెలోడీస్, కేస్ 99, ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి, భీమ్లా నాయక్, అరి, వినరో భాగ్యము విష్ణు కథ, ఎఫ్ 3, సామజ వర గమన, ఆది కేశవ, సెల్ఫిష్, గుంటూరు కారం, ధూమ్ ధాం, ఆరంభం తదితర సినిమాల్లో నటించారు. బందా,సేవ్ ద టైగర్స్, డిగ్రీ డేస్, వ్యూహం, దీ హిట్ మ్యాన్..తదితర వెబ్‌సిరీస్‌లో కూడా నటించారు. నాకు తెలిసింది నేర్చుకున్నది చేతనైంది నటించడం మాత్రమే అని గర్వంగా చెప్పుకుంటారు.

– యడవల్లి శ్రీనివాసరావు

వ్యూహాత్మక భాగస్వామ్యానికి ప్రాధాన్యత

జిన్‌పింగ్‌తో వియత్నాం అధ్యక్షుడు భేటీ



బీజింగ్ : సోషలిజం నిర్మాణంలో మరిన్ని విజయాలు సాధించేందుకు గాను ఇటీవల కన్నుమూసిన వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్‌గుయెన్ ఫు ట్రాంగ్ వారసత్వాన్ని వియత్నాం ప్రభుత్వం, పార్టీ పరిరక్షించగలవన్న విశ్వాసాన్ని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వ్యక్తం చేశారు. వియత్నాం అధ్యక్షుడు, కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి లామ్ ప్రస్తుతం బీజింగ్‌లో పర్యటిస్తున్నారు. వియత్నాం విప్లవ ప్రయోజనాలకు చైనా-వియత్నాం సంబంధాలకు, ప్రపంచవ్యాప్తంగా సోషలిజం అభివృద్ధికి గణనీయమైన రీతిలో సేవలందించిన ఎన్‌గుయెన్ మృతికి జిన్‌పింగ్ నివాళి అర్పించారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను నూతన స్థాయికి తీసుకెళ్లే సమయం ఆసన్నమైందన్నారు. చైనా విదేశాంగ విధానంలో వియత్నాంకు ఎప్పుడూ అధిక ప్రాధాన్యత వుంటుందన్నారు. పార్టీ నాయకత్వంలో పట్టుదలకు, సోషలిజం నిర్మాణాన్ని ప్రోత్సహించడానికి చైనా మద్దతునిస్తుందన్నారు.

వియత్నాం, చైనా మధ్య సమగ్ర వ్యూహాత్మక సహకార భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు తాము కృతనిశ్చయంతో ఉన్నాయన్నారు. ఇరు దేశాల మధ్య సాంప్రదాయబద్ధమైన స్నేహ బంధం మరింతగా వర్ధిల్లాలని వియత్నాం నేత లామ్ ఆకాంక్షించారు. రెండు పార్టీల మధ్య, రెండు దేశాల మధ్య సుదీర్ఘ స్నేహ బంధం కొనసాగేందుకు చైనా నేతలతో కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నట్లు లామ్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా, ప్రాంతీయంగా సంక్లిష్టమైన, అనూహ్యమైన పరిణామాలు సంభవిస్తున్న నేపథ్యంలో వియత్నాం స్వతంత్ర విదేశాంగ విధానాన్ని అనుసరించడంతో పాటు స్వావలంబన, శాంతి, స్నేహం, సహకారం, అభివృద్ధి, వైవిధ్యం, బహుళ సంబంధాలను కొనసాగిస్తుందని చెప్పారు.

అన్ని రంగాల్లో పరస్పర సహకారం, విశ్వాసాన్ని పెంపొందించుకోవాలని వారు సంకల్పించారు. చైనాలో మూడు రోజుల పర్యటన కోసం ఆదివారం బీజింగ్‌కు చేరుకున్న వియత్నాం నేతకు ఘన స్వాగతం లభించింది.

షూటింగ్ జూనియర్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌కు

గుంటూరు వాసి ఎంపిక



ప్రజాశక్తి-గుంటూరు లీగల్

పెరూ దేశం లిమాలో సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ ఆరు వరకు జరిగే జూనియర్ వరల్డ్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించేందుకు గుంటూరు శ్రీనగర్ కాలనీకి చెందిన నేలవల్లి ముఖేష్ ఎంపికయ్యారు. నేషనల్ రైఫిల్ అసోసియేషన్(ఎన్‌ఆర్‌ఐ) దేశానికి ప్రాతినిధ్యం వహించనున్న క్రీడాకారుల జాబితాను ఆదివారం ప్రకటించింది. ఆరు నెలలుగా పలు విభాగాల్లో జరిగిన సెలక్షన్ ట్రయల్స్‌లో విశేష ప్రతిభ కనబరిచిన ముఖేష్... మొత్తం ఆరు విభాగాల్లో పది పతకాలకు పోటీలకు అర్హత సాధించాడు. ఇందులో 10.మీ. ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంతో పాటు మిక్స్‌డ్, 25మీ. ర్యాపిడ్ ఫైర్ పిస్టల్, స్పోర్ట్స్ పిస్టల్, స్టాండర్డ్ పిస్టల్-3 విభాగం వ్యక్తిగత, టీం విభాగాలకు ఎంపికయ్యాడు. 50మీ. ఫ్రీ పిస్టల్ విభాగంలోనూ ముఖేష్ జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. ముఖేష్ షూటింగ్ శిక్షణ ప్రారంభించిన తొలినాళ్లలో, గుంటూరులోని అమరావతి రోడ్డులోని ఇండియన్ అకాడమీ ఆఫ్ షూటింగ్ స్పోర్ట్స్‌లో సుబ్రహ్మణ్యేశ్వరరావు శిక్షణలో 10మీ. ఎయిర్ పిస్టల్ విభాగంలో జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అనంతరం మెరుగైన శిక్షణ కోసం పూణేలోని ఒలింపిక్ మెడలిస్ట్ గగన్ నారంగ్‌కు చెందిన గన్ ఫర్ గ్లోరీ షూటింగ్ అకాడమీలో గత రెండేళ్లుగా 10మీ. ఎయిర్ పిస్టల్ విభాగంతో పాటు 25మీ., 50మీ. పిస్టల్‌లోని పలు విభాగాల్లో అంతర్జాతీయ స్థాయి కోచ్‌లు సి.కె చౌదరి, ఓవ్ కనీప్‌ల శిక్షణలో జాతీయస్థాయిలో విశేషంగా రాణించాడు. గత మూడేళ్ల నుంచి ముఖేష్ జాతీయ స్థాయిలో నేషనల్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌తో పాటు, ఖేలో ఇండియా గేమ్స్‌లో కూడా రాష్ట్రానికి పదుల సంఖ్యలో పతకాలు అందించాడు. కేంద్ర ప్రభుత్వం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ద్వారా అందిస్తున్న ఖేలో ఇండియా స్కీంతో పాటు దేశంలోని ఉత్తమ క్రీడాకారులకు ప్రాజెక్ట్ లీప్ కింద ఇస్తున్న శిక్షణ ముఖేష్‌ను జాతీయ స్థాయిలో మంచి క్రీడాకారునిగా ఎదగడానికి తోడ్పడింది. ముఖేష్ ప్రస్తుతం కె.ఎల్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు.

ఎఐఎఫ్‌ఎఫ్ నూతన జనరల్ సెక్రటరీగా

అనిల్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

న్యూఢిల్లీ: ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్(ఎఐఎఫ్‌ఎఫ్) నూతన జనరల్ సెక్రటరీగా అనిల్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఎఐఎఫ్‌ఎఫ్ కోశాధికారి కిపా అజయ్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎం. సత్యనారాయణ పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం అనీల్‌కుమార్ మాట్లాడుతూ.. తనకు కేరళ ఫుట్‌బాల్ అసోసియేషన్‌తో కలిసి పనిచేసిన అనుభవముందని, అన్ని విభాగాలను కలుపుకొని పనిచేస్తానని తెలిపారు. రాబోయే రోజుల్లో భారత ఫుట్‌బాల్ క్రీడను బలోపేతం చేయడమే తన ముందున్న ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఎఐఎఫ్ ప్రధాన కార్యదర్శి షాజీ ప్రభాకరన్ గత ఏడాది నవంబర్‌లో ఆ పదవినుంచి తొలగించడంతో తాజాగా అనీల్ కుమార్ ఆ బాధ్యతలను స్వీకరించారు. అలాగే ఆలిండియా ఫుట్‌బాల్ కమిటీనుంచి మద్దతును కోరనున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు.

తొలిరౌండ్‌లోనే ఓడిన నాగల్

న్యూయార్క్: విన్‌స్టోన్ ఓపెన్ ఎటిపి సూపర్-250 టోర్నమెంట్‌లో భారత సంచలనం సుమిత్ నాగల్ తొలిరౌండ్‌లోనే పరాజయాన్ని చవిచూశాడు. ఎటిపి సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో 77వ ర్యాంక్ ఆటగాడైన సుమిత్ సోమవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో 4-6, 2-6తో క్రొయేషియాకు చెందిన బోర్నా కోరిక్ చేతిలో వరుససెట్లలో ఓడాడు. ఈ మ్యాచ్ కేవలం ఒక గంటా 10 నిమిషాల్లోనే ముగిసింది. తొలి సెట్‌లో ఒక బ్రేక్ పాయింట్ సాధించి ప్రత్యర్థిపై ఆధిక్యతలో నిలిచినా.. ఆ తర్వాత వరుసగా పాయింట్లను చేజార్చుకొని ఓటమిపాలయ్యాడు. అమెరికా కాలేజ్ సర్క్యూట్‌లో దక్షిణేశ్వర్ సింగిల్స్ మెయిన్ డ్రాకు అర్హత సాధించలేకపోయాడు. క్వాలిఫయింగ్ ఈవెంట్ రెండోరౌండ్‌లో దక్షిణేశ్వర్ 3-6, 4-6తో నాల్గో సీడ్ లెర్నర్ టియెన్ చేతిలో పరాజయాన్ని చవిచూశాడు.

రాఖీ కాదు.. రక్షణ కావాలి



- జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం పట్ల వినూత్న నిరసనలు
- రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిన ఆందోళనలు

ప్రజాశక్తి- యంత్రాంగం

కోల్‌కత్తాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారాన్ని ఖండిస్తూ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సోమవారం కూడా ఆందోళనలు కొనసాగాయి. ఏలూరులో వైద్యులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. స్థానిక సర్వజన ఆస్పత్రిలో వైద్యులు రక్తపు మరకలను పోలిన ఎర్రని మరకలతో నిండిన తెల్లకోటును చెట్టుకు వేలాడదీసి, వైద్యులపై జరుగుతున్న హింసను ప్రతిబింబించేలా 'తెల్ల కోటు ఎర్రబారుతుంది' అనే స్లోగన్ ఆ కోటుపై రాశారు. కుక్కునూరులో 'రాఖీ కాదు... రక్షణ కావాలి' అనే నినాదంతో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలోని సెయింట్ ఆన్స్ విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్లకార్డులతో ర్యాలీ చేశారు. నిరసనకు ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మద్దతు తెలిపారు. భీమవరంలో ధర్నా, నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆకివీడు లో ఎస్‌ఎఫ్‌ఐ, ఐద్వా, డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మానవహారంగా ఏర్పడ్డారు. ఉండిలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. మొగల్తూరు లో అంగన్ వాడీలు మానవహారంగా ఏర్పడ్డారు. దీనికి ముందు ప్రదర్శన నిర్వహించారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన చర్చి సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. ర్యాలీగా వచ్చి ఈ కార్యక్రమం చేపట్టారు. విశాఖ నగరంలో జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆంధ్ర వైద్య కళాశాల నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు వైద్య విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ధర్నా చేశారు. సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను అమలు చేయాలని నినాదాలు చేశారు. అల్లూరి జిల్లా పాడేరులో చైతన్య స్రవంతి సంస్థ ఆధ్వర్యంలో గిరిజన మహిళలు నిరసన తెలిపారు. డుంబ్రిగుడలో మానవ హక్కుల నేరనిరోధక సంఘం ఆధ్వర్యాన కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం, మామిడికుదురులో వివిధ విద్యా సంస్థల విద్యార్థులు ప్లకార్డులతో నిరసన ర్యాలీ చేశారు. తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం చివటంతో మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులు శాంతి ర్యాలీ నిర్వహించారు. కాకినాడ జిల్లా ఏలేశ్వరంలో సిపిఐఎంఎల్, కాకినాడ రూరల్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు జరిగాయి.

ఎంపి, ఎమ్మెల్యే ప్రత్యేక కోర్టుల పనితీరుపై

న్యాయశాఖ అధ్యయనం

- నిపుణుల నుంచి ప్రతిపాదనలకు ఆహ్వానం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

క్రిమినల్ కేసులను త్వరితగతిన విచారించేందుకు ఏర్పాటైన ప్రత్యేక కోర్టుల సమగ్ర పనితీరుపై ఐఐఎంలు, ఐఐటిలు, న్యాయ విశ్వ విద్యాలయాలు, జ్యుడీషియల్ అకాడమీలతో సహా అత్యున్నత సంస్థల నుంచి ప్రతిపాదనలను కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖ ఆహ్వానించింది. ఎంపి, ఎమ్మెల్యేలకు సంబంధించిన క్రిమినల్ కేసులను విచారణ ఏర్పాటు చేసిన కోర్టుల కార్యాచరణ, సమర్థత, మొత్తం ప్రభావాన్ని అంచనా వేయనున్నారు. న్యాయ మంత్రిత్వశాఖ ఆధ్వర్యాన పనిచేసే స్కీమ్ ఫర్ యాక్షన్ రీసెర్చ్ అండ్ స్టడీస్ ఆన్ జ్యుడీషియల్ రిఫార్మ్స్' కింద ప్రతిపాదనలు ఆహ్వానించారు. 2017లో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎంపిలు, ఎమ్మెల్యేలకు సంబంధించిన క్రిమినల్ కేసులను త్వరితగతిన విచారించేందుకు రాష్ట్రాల్లో 12 ప్రత్యేక కోర్టుల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. దీని ప్రకారం ఢిల్లీలో రెండు, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళలో కోర్టులు ఏర్పాటు చేశారు. 2018 డిసెంబరులో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు బీహార్, కేరళ ప్రత్యేక కోర్టులు నిలిపివేయబడ్డాయి. ఈ ప్రత్యేక కోర్టుల పనితీరును సుప్రీంకోర్టు పర్యవేక్షిస్తోంది. సోమవారం అందుబాటులో ఉన్న ప్రత్యేక కోర్టుల డ్యాష్‌బోర్డు ప్రకారం, ఢిల్లీలోని రెండు ప్రత్యేక కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు లేవు. ఏ కేసు కూడా పరిష్కరించబడలేదు. అదేవిధంగా, ఉత్తరప్రదేశ్‌లో కోర్టు 50 కేసులను పరిష్కరించింది. 1,137 పెండింగ్‌లో ఉన్నాయి. మధ్యప్రదేశ్‌లో ఐదు కేసులను పరిష్కరించింది. ఇంకా 319 పెండింగ్‌లో ఉన్నాయి. మహారాష్ట్రలో 419 పెండింగ్‌లో ఉన్నాయి. 13 కేసులను కోర్టు పరిష్కరించింది. ప్రత్యేక ఎంపి, ఎమ్మెల్యే కోర్టులు, ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులు, గ్రామ న్యాయాలయాలు (విలేజ్ కోర్టులు), టెలి-లా స్కీమ్‌ల పనితీరును అధ్యయనం చేయడానికి కూడా శాఖ ప్రతిపాదనలను ఆహ్వానించింది.

అమన్‌కు 2వ ర్యాంక్

యుడబ్ల్యుడబ్ల్యు ర్యాంకింగ్స్ విడుదల



న్యూఢిల్లీ: యునైటెడ్ ప్రపంచ రెజ్లింగ్(యుడబ్ల్యుడబ్ల్యు) ర్యాంకింగ్స్‌లో అమన్ షెహ్రావత్ సత్తా చాటాడు. యుడబ్ల్యు డబ్ల్యు సోమవారం ప్రకటించిన 57కిలోల విభాగం ర్యాంకింగ్స్‌లో అమన్ షెహ్రావత్ 2వ ర్యాంక్‌కు ఎగబాకాడు. పారిస్ ఒలింపిక్స్‌కు ముందు 6వ ర్యాంక్‌తో బరిలోకి దిగిన అమన్.. కాంస్య పతకం సాధించి 51,600 పాయింట్లతో 2వ ర్యాంక్‌కు చేరాడు. పారిస్ ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత హిగుచీ(జపాన్) 59,000పాయింట్లతో టాప్ లో ఉన్నాడు. ఒలింపిక్స్‌లో అమన్ సాధిం చి భారత్ తరపున రెజ్లింగ్‌లో మెడల్ కొట్టిన పిన్న వయస్కుడిగా రికార్డు పుటల్లోకెక్కాడు. పతక పోరులో 13-5పాయింట్ల తేడాతో ప్యూర్టోరికో కు చెందిన డారియన్ టోయ్ క్రూజ్‌ను చిత్తుచేశాడు. జాతీయ సెలెక్షన్ ట్రయల్స్‌లో అమన్.. టోక్యో ఒలింపిక్స్ రజత పతక విజేత రవి దహియాను ఓడించి 2024 పారిస్ ఒలింపిక్స్‌కు అమన్ అర్హత సాధించా డు. 2008నుంచి ఒలింపిక్స్ రెజ్లింగ్ విభాగంలో భారత్‌కు ప్రతిసారి దక్కుతోంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68